

పింఛన్ల పంపిణీ.. నేడే

» జిల్లా కలెక్టర్ ఆదేశాలు
» ఉదయం నుంచే ఇళ్లకు సచివాలయ సిబ్బంది

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ఒకరోజు ముందుగానే మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సామాజిక భద్రత కింద ప్రతినెల వృద్ధులు, వితంతు, ఒంటరి, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కళాకారులకు అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఒకరోజు ముందుగా అనగా మంగళవారం పంపిణీకి తగిన ఏర్పాట్లు చేశామన్నారు.జిల్లాలో2లక్షల73వేల202మందికి రూ.116.08కోట్ల సామాజిక భద్రత కింద వివిధ రకాల పింఛన్ల లబ్ధిదారులకు అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. 2025, జనవరి నెల ఎన్టీఆర్ భరోసా పింఛను జనవరి 1న పంపిణీ చేయల్సి ఉండగా ఒకటోతేదీ కొత్త సంవత్సరం కారణంగా ప్రభుత్వం ఒకరోజు ముందుగానే డిసెంబరు 31, మంగళవారం ఉదయం 6గంటలనుంచి పింఛన్లు పంపిణీ చేయాలని నిర్ణయించిందన్నారు. గ్రామ,వార్డు సచివాలయాలసిబ్బంది పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల పంపిణీ పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 15 లోపు చనిపోయిన పింఛన్‌దారుడిని భార్యకు (స్పౌజ్‌పింఛను) అందించాలని నిర్ణయించడంతో జిల్లాలో 261మందికి పింఛను అందించేందుకు తగిన ఆదేశాలు జారీ చేశామన్నారు. వీరికి కూడా ఈనెల 31నే పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

హత్యలతో రక్తసిక్తం



» పెరిగిన సైబర్ క్రైం, చోరీ, అట్రాసిటీ కేసులు
» మహిళలపై అఘాయిత్యాలదీ అదే పరిస్థితి
» వార్షిక నేర గణాంకాలను వెల్లడించిన ఎస్పీ

కాకినాడ క్రైం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది హత్యల పరంపరతో నేల రక్తసిక్తమైంది. సైబర్ నేరాలు పెరిగాయి. జిల్లాలో క్రైం విభాగాన్ని నిర్వీర్యం చేసి ఆ శాఖను లా అండ్ ఆర్డర్‌లో విలీనం చేయడంతో స్పష్టత లేక చోరీలు పెరిగిపోయాయి. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు గతేడాది కంటే అధికమయ్యాయి. డ్రంక్ అండ్ డ్రైవ్‌ను పటిష్టంగా అమలు చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఈ ఏడాది జరిగిన నేర గణాంకాలను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ వెల్లడించారు.

చాప కింద నీరులా సైబర్ నేరాలు

జిల్లాలో 2023లో 21 హత్యలు చోటుచేసుకోగా 2024లో 28 హత్యలు చోటుచేసుకున్నాయి. ఈ పరిణామాలు శాంతిభద్రతల పరిరక్షణకు ఎంతగానో విఘాతం కలిగించాయి. గతేడాది జిల్లావ్యాప్తంగా 1,854 సైబర్ నేరాలపై ఫిర్యాదులు నమోదు కాగా ఈ ఏడాది 2,672 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ తరహా నేరాలకు సంబంధించి గతేడాది 39 కేసులు నమోదుచేయగా 2024లో 55 కేసులు నమోదు చేశారు. సైబర్ నేరాలు చాప కింద నీరులా నానాటికీ పెరుగుతున్నాయి. సైబర్ క్రైం మోసాలకు చెక్ పెట్టేందుకు ఐ యామ్ సైబర్ అవేర్ అనే కార్యక్రమాన్ని నవంబరు 19న ప్రారంభించారు. వీటిపై ఇప్పటివరకు 1,257 అవగాహనాసదుస్సులు నిర్వహించారు.

చోరీల తీరిది

పగటిపూట, రాత్రిపూట నేరాలు గతేడాది 113 నమోదు కాగా 2024లో 141 కేసులు నమోదయ్యాయి. ఇందుకు కారణం ప్రజలకు స్వీయ రక్షణ లేకపోవడం, లైట్‌హౌస్ మోనట రింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకోకపోవడమేనని ఎస్పీ తెలిపారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెరిగాయని, నేరప్రభావిత ప్రదేశాలను గుర్తించి నిఘా ఉంచడం రివ్యూ మీటింగ్‌లు, నేరస్తుల పట్ల కఠినమైన చర్యల ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని ఎస్పీ తెలిపారు.

రోడ్డు ప్రమాదాలు ఇలా..

రోడ్డు ప్రమాదాల్లో గతేడాది 295మంది దుర్మరణం పాలవ్వగా 2024లో 287మంది మృత్యువాతపడ్డారు. జిల్లాలో జోన్‌ల వ్యవస్థ ఏర్పాటు చేసి స్టాప్‌వాష్ అండ్ గో వంటి కార్యక్రమాల ద్వారా బ్లాక్ స్పాట్లను గుర్తించడం.. రెక్టిఫికేషన్, ప్రమాద సమయాలను గుర్తించి పోలీస్ నిఘాను, ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచామని ఎస్పీ తెలిపారు. పలు ముఖ్య కూడళ్లలో డ్రంక్ అండ్ డ్రైవ్‌ను నిర్వహించడం ద్వారా గతేడాది 5,805 కేసులు బుక్ చేస్తే ఈ ఏడాది 7,879 కేసులు బుక్ చేసి మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని జైలుకు పంపడం లేదా భారీగా జరిమానా విధించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించగలిగామన్నారు.

మహిళా రక్షక్ వాహనాలను ఏర్పాటు చేసి ప్రత్యేక సిబ్బందిని నియమించడం ద్వారా ప్రభావిత ప్రదేశాల్లో జియో మ్యాపింగ్, మహిళా పోలీసుల పర్యవేక్షణ తదితర చర్యలవల్ల మహిళలపై నేరాలు తగ్గుముఖం పట్టాయని, ఈ తరహా కేసులు 2023లో 565 కేసులు నమోదు కాగా ఈఏడాది 791 కేసులు నమోదయ్యాయని, జిల్లావ్యాప్తంగా డ్రోన్స్‌ను వినియోగించి నేరాలను మరింత అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని, చోరీకి గురైన లేదా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను గతేడాది 1,080 రికవరీ చేయగా ఈ ఏడాది 1,791 రికవరీ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. 2025 నేరరహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.

నూతన సంవత్సర వేడుకలకు బొకేలు వద్దు

విద్యార్థులకు ఉపయోగపడేలా పుస్తకాలు తీసుకురావాలి: కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): 2025, జనవరి 1న నూతన సంవత్సరం సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చే జిల్లా అధికారులు, ఉద్యోగులు, అభిమానులు, ప్రజలు, నాయకులు బొకేలు, పూలదండలు, దుశ్శాలువాలు తీసుకురావద్దని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జనవరి 1న బుధవారం ఉదయం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తాను అందుబాటులో ఉంటానన్నారు. వివిధ సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులు, పేద విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలతోపాటు తువాళ్లు, కాస్మొటిక్ మెటీరియల్స్ సబ్బులు, టూత్ బ్రెష్, టూత్ పేస్ట్, షాంపులు, పెన్నులు వంటివి తీసుకురావాలన్నారు.

ఆలీవ్ రిడ్లీ తాబేళ్లను పరిరక్షించాలి: డిప్యూటీ సీఎం ఆదేశాలు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ సముద్రతీరంలో ఉన్న ఆలీవ్ రిడ్లీ తాబేళ్లను పరిరక్షించాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాబేళ్ల మరణానికి కారణాలపై విచారించి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారి చిరంజీవిని ఆదేశించారు.

3న జరిగే వైజ్ఞానిక ప్రదర్శన గోడపత్రిక ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్ మీనా

కలెక్టరేట్(కాకినాడ)/సర్పవరం జంక్షన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వచ్చేనెల 3న జరిగే జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించి గోడపత్రికను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ సామర్థ్యాలు, సృజనాత్మకత వెలికితీసేందుకు విద్యావైజ్ఞానిక ప్రదర్శన దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు, డీఈవో రమేష్, జిల్లా సైన్సు అధికారి శ్రీనివాస్ వినీల్ కుమార్ పాల్గొన్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి: కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందిన అర్జీలకు తగిన పరిష్కారాలు అందివ్వాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ప్రజాసమస్యల పరిష్కార నిమిత్తం రాష్ట్రప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్‌లో జరిగింది. రెవెన్యూ, పింఛన్లు, బియ్యంకార్డు మంజూరు, ఇళ్లస్థలాలు తదితర అంశాలకు చెందిన 286 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, కేఎస్‌ఈజెడ్ ఎస్డీసీ రామలక్ష్మి, సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు.



ఎక్కడ నెగ్గాలో కాదు.. ఎక్కడ తగ్గాలో తెలిసినోడు గొప్పోడు.. దర్శకుడు త్రివిక్రమ్ అత్తారింటికిదారేది సినిమాలో రాసిన డైలాగ్ ఇది. ఈ ఏడాది ఆ డైలాగ్‌నే నిరూపించింది.. గతేడాది చంద్రబాబును జైలులో పరామర్శించి పొత్తు పెట్టుకుని తగ్గిన పవన్.. ఈ ఏడాది ఎన్నికల్లో నువ్వా నేనా అంటూ తలపడి.. కాచుకో జగన్ అంటూ శపథం చేసి మరీ గోదావరి జిల్లాల్లో వైసీపీని తుడిచిపెట్టేశారు.. కూటమిని విజయపతాకాన చేర్చారు.. పిఠాపురాన నెగ్గి డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించారు.. ఇక 2024 లో మిగిలింది కొన్ని గంటలే.. 2024 కలిపితే 8.. ఏ 8లో ఉన్నామో చూసుకునే సమయం వచ్చేసింది.. ఓటరు అనుకున్నది సాధించాడు.. కూటమిని గెలిపించాడు.. సూపర్ సిక్స్‌లో ఇప్పటికే రెండు హామీలు నెరవేర్చింది. వైసీపీని జీరో చేసింది.. మద్యం పాలసీ మార్చింది.. ఉచిత ఇసుక విధానానికి శ్రీకారం చుట్టింది.. జిల్లా నలు దిక్కులా అభివృద్ధికి బాటలు వేస్తున్నారు.ఒక్కసారి 12 నెలలు వెనక్కు వెళితే ఈ ఏడాది బాధకంటే ఆనందమే ఎక్కువ.. మరలిరాని క్షణాలు మననం చేసుకుందాం.. కొత్త ఏడాది 2025కి స్వాగతం చెబుదాం..

మరలిరాని క్షణాలు.. చెరిగిపోని జ్ఞాపకాలు

» చరిత్ర పుటల్లో 2024
» ఓటు విలువ చాటిన ఏడాది
» కూటమి విజయఢంకా
» శపథం చేసి గెలిచిన పవన్
» జిల్లాలో వైసీపీ జీరో
» మూడు మంత్రి పదవులు
» తుఫాన్‌లు.. విషాదాలు
» ఏడాదికి మిగిలింది గంటలే

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కరిగిపోయే కాలంలో మిగిలిపోయే జ్ఞాపకాలు ఎన్నో ఉంటాయి. అందులో కొన్ని సంతోషాన్నిస్తే..మరికొన్ని విషాదాన్ని నింపుతాయి.. మరికొన్ని మనసును పిండేస్తే..ఇంకొన్ని భయాందోళనలకు గురిచేస్తాయి. ఇవన్నీ ఒక్క ఏడాదిలోనే చోటు చేసుకుంటే అదే 2024. మరికొన్ని గంటల్లో చరిత్ర పుటల్లో కలిసి పోనున్న 2024 ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ఉగాది పచ్చడిలా అన్ని రకాల భావోద్వేగాలను పంచింది.ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తోన్న ప్రజాకంటక పాలనకు చరమగీతం పలికి తూర్పుగోదావరి జిల్లా ప్రజలను సంబరాలు చేసుకునేలా చేసిందీ ఏడాది.పిల్లాపాపలతో ప్రతి ఒక్కరూ రోడ్డెక్కి కూటమి విజయాన్ని తమ విజయంగా పండుగ చేసు కున్న ఈ ఏడాదిగా ప్రతి ఒక్కరిలో తీపి జ్ఞాపకాలు పంచింది. అటు అవ్వాతాతలకు పింఛన్ పెరిగి మోముపై చిరునవ్వులు పూయించగా, ఉచిత గ్యాస్ సిలిండర్ చేతికి అందడంతో పేద,మధ్య తరగతి ప్రజల్లో ఆనందాలు మిన్న ంటాయి.అటు ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరులో వర్షాలు, గోదా వరి,ఏలేరు వరదలతో ఉమ్మడి జిల్లా చిగురు టాకులా వణికి పోయింది.దారి తప్పిన పులులు రాజమహేంద్రవరం,ప్రత్తిపాడులో సంచరిస్తూ కొన్ని వారాలను జనాలను బెంబేలెత్తించింది ఈ ఏడాది లోనే.అటు సీజ్ ద షిప్ అన్న పవన్ వ్యాఖ్యలతో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పేరు మార్మోగి పోయింది. అదే సమయంలో సంచలనాత్మ కమైన వరుస హత్యలు,రక్తపుటేరులు పారిం చిన రోడ్డు ప్రమాదాలు.. జేబులు గుల్ల చేసే సిన సైబర్ నేరాలు ఉమ్మడి జిల్లాను కలవర పెట్టా యి. అటు అఖండ గోదావరికి ఇన్నేళ్లకు రూ.100 కోట్లు మంజూరై హేవలాక్ వంతెన రూపు మార్చు కోబోతుండడం, శుచి, శుభ్రతలో అన్నవరం ప్రసాదానికి జాతీయస్థాయిలో గుర్తింపు రావడం అందరినీ ఆనందపరిచాయి.



1 ఎంత సంతోషమో..



వైసీపీ ఐదేళ్ల పాలనకు విముక్తి కలిగించి ఉమ్మడి జిల్లా ప్రజలకు సాంత్వన చేకూర్చి సంతోషాన్ని మిగి ల్చిన ఏడాదిగా 2024 అందరికీ గుర్తుండి పోనుంది.పన్నుల వాత..ఛార్జీల మో త.. సోషల్ మీడియా పేరుతో అరెస్టులు.. ప్రజ ల వారసత్వ ఆస్తులు లాగేసుకునేలా లాండ్ టైట్లింగ్ యాక్ట్‌లతో ఉమ్మడి జిల్లా ప్రజలకు వైసీపీ కం టిపై కునుకు లేకుండా చేసింది. ఈ ప్రజాకంటక పాలనకు ఈ ఏడాది మేలో వచ్చిన అసెంబ్లీ ఫలితాలతో ఒక్కసారిగా ప్రజల్లో ఆనందం కట్టలు తెచ్చేకునేలా చేసింది. ఇన్నేళ్ల నరక యాతనకు ముగింపు పలికిందన్న సంతోషం ఉమ్మడి జిల్లాలో పెల్లుబికింది. మొత్తం అన్ని అసెంబ్లీ సీట్లలో వైసీపీ ఓడిపోవడంతో జిల్లాలో సంబరాలు మిన్నంటా యి. అటు కూటమి ప్రభుత్వం రాగానే ఎప్పుడూ లేని విధంగా వరుస నామినేటెడ్ పదవుల పందేరంతో ఉమ్మడి జిల్లాలో మూడు పార్టీల నేతలు,కార్యకర్తల్లో సంతోషం తొణకిసలాడింది. దాదాపు అన్ని నియోజకవర్గాలకు పదవులు దక్కడంతో నేతలు సంబరాలు చేసుకున్నారు.

2 అభివృద్ధి దిశగా..

అఖండ గోదావరి ప్రాజెక్టు కింద దాదాపుగా రూ.100 కోట్లు రాజమహేం ద్రవరానికి నిధులు మంజూరవడం గోదావరి వాసులను పులకరింప చేసింది. గోదావరిపై ఉన్న హేవ్‌లాక్ వంతెన ఆధునికీకరణకు అడుగులు పడడంతో పర్యాటక ప్రియులకు సంతోషం పం చింది.అన్నవరం ప్రసాదానికి జాతీయస్థాయిలో మరో సారి గుర్తింపు లభించిందీ ఈ ఏడాదిలోనే. సుచి,శుభ్రతలో భారత ఆహార ప్రమాణాల సంస్థ గుర్తింపు ఇవ్వడం భక్తులను ఆనందపరిచింది.

3 పింఛన్..పెంచెన్..

ఒక్కసారిగా పింఛన్ డబ్బులు పెరగ డంతో ఆయా వర్గాలు సంబరాలు చేసుకున్నాయి. సూపర్‌సిక్స్ పథకం అమల్లో భాగంగా దీపావళికి ఉచితగ్యాస్ సిలిండర్‌ను కూటమి ప్రభుత్వం అం దించడంతో మహిళల్లో ఆనం దం వెల్లివిరిసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాతిపదికన వచ్చే ఏడాది ఉగాది నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేయడానికి ప్రభుత్వం అడుగులు వేస్తున్న విషయం తేల డంతో మహిళల ఆనందానికి అంతు లేకుండా పోయింది. మరోపక్క మద్యం దుకాణాలు బడా వ్యాపారుల చేతుల్లోనే ఉంటాయన్న నానుడికి చరమగీతం పాడి కూటమి ప్రభుత్వం లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలను కేటాయించడంతో ఉమ్మడి జిల్లాలో అతి సామాన్యులు, పేదలకు జాక్‌పాట్ తగిలింది.



జీవితాల్లో పెను తుఫాన్ 4

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాకు సంతోషంతోపాటు దుఃఖాన్ని పంచింది. ప్రధానంగా ఎడతెరిపి లేని వర్షాలు, తుఫాన్‌లు ప్రజలను నానా ఇబ్బందులు పెట్టాయి. ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలు, గోదావరి, ఏలేరు వరదలైతే వారాల తరబడి ప్రజలను బెంబేలెత్తించాయి.ఒక్క ఏలేరు వరద ధాటికే రూ.172 కోట్ల నష్టం వాటిల్లినట్టు లెక్కగట్టారు. కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు మరణం ఎందరినో కలచివేసి విషాదంలోకి నెట్టింది.



5 ఎంత విషాదమో..

ఈ ఏడాది సంచలనాత్మక హత్యలు, ఇతర నేరాలు, రోడ్డుప్రమాదాలు, సైబర్ నేరాలు ఉమ్మడి జిల్లాలో ఎంతో విషాదం నింపాయి.ప్రధానంగా దీపావళి రోజు కాజులూరు మండలం శల పాక లో చోటుచేసుకున్న మూడు హత్యలు ఉమ్మడి జిల్లాను ఉలిక్కిపడేలా చేశాయి.ఆ తర్వాత డిసె ంబరులో సామర్లకోట మండలం వేట్ల పాలెంలో మూడు హత్యలు మళ్లీ భయ పెట్టా యి.ఈ రెండు నేరాల్లోను కత్తులు, గునపా లతో ప్రత్య ర్థులను పొడిచి చంపిన తీరు ప్రత్యర్థులు నేర స్వభావాన్ని చూపింది. రాజమ హేంద్రవరం సమీపంలో రేవ్‌పార్టీ వ్యవహారం బయటపడ డంతో అంతా ఉలిక్కిపడ్డారు. మారే డు మిల్లిలో విహారయాత్రకు వచ్చి జలపాతంలో ఏలూరుకు చెందిన ముగ్గురు వైద్యవిద్యార్థినులు గల్లంతై ఆ తర్వాత చనిపోవడం తీవ్ర విషాదం నింపింది. వివిధ రోడ్డు ప్రమాదాల్లో ఉమ్మడి తూర్పుగోదా వరి జిల్లాలో సుమారు 800 వరకూ మృత్యువాత పడడం ఆయా కుటుంబాల్లో వేదన మిగిల్చింది.

ఏ నెలలో ఏం జరిగిందంటే..

జనవరి 6: దివాన్‌చెరువు గైట్ క్యాంపస్‌లో రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.జనవరి 25: ఉమ్మడి తూర్పు జిల్లాలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పర్యటించి చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మరణించిన కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. జనవరి 30:రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో టీడీపీ అధినేత చంద్రబాబు రా..కదలిరా సభనిర్వహించారు.లక్షలాది జనం తరలివచ్చారు.

ఫిబ్రవరి 12: అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం ఐ.పోలవరం సమీపంలోని సీతపల్లి వాగులో పడి రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు.ఫిబ్రవరి 27: ప్రత్తిపాడు సమీపంలో పాదాలమ్మ గుడివద్ద లారీడ్రైవర్లపై ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు.

మార్చి 12:ముద్రగడ పద్మనాభం వైసీపీలో చేరారు.మార్చి 25:కాకినాడ సాగరతీరంలో ఇండో-యుఎస్‌ఏ నావికాదళ విన్యాసాలు జరిగాయి. మార్చి 30: పిఠాపురంలో జనసేన అధినేత పవన్ తొలిరోజు ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు.

ఏప్రిల్4: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో విజయవంతంగా ప్రజాగళం సభ నిర్వహించిన టీడీపీ అధినేత చంద్రబాబు.. ఏప్రిల్ 11: అమలాపురం,పి.గన్నవరంల్లో చంద్రబాబు,పవన్ పర్యటన ఏప్రిల్ 19:వాడపల్లి వెంకన్న కల్యాణం.

మే 7: రాజమహేంద్రవరంలో టీడీపీ, బీజేపీ, జనసేన సభ.. హాజరైన మోదీ, పవన్, లోకేశ్. మే 13: ఓటెత్తిన జనం.. కోనసీమలో 82.61 శాతం, కాకినాడలో 74.24,తూర్పున 79.43 శాతం పోలింగ్.మే 14:మే 21: కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందారు.మే 28:అనారోగ్యంతో సంపర మాజీ ఎమ్మెల్యే అనిశెట్టి బుల్లిఅబ్బాయిరెడ్డి మృతి చెందారు.

జూన్ 4: కూటమిదే విజయం. గోదారి ఓట్ల వరదలో ఫ్యాన్ గల్లంతు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఉమ్మడి తూ.గో.జిల్లాలో 22 సీట్లలో వైసీపీ ఘోర పరాజయం.జూన్ 12: మూడు జిల్లాలకు ముగ్గురు మంత్రులు..డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్, కేబినెట్‌లో దుర్గేష్, సుభాష్‌లకు చోటు . జూన్ 20: ప్రొటెం స్పీకర్‌గా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి అసెంబ్లీలోగౌరవం కల్పించారు.

జూలై 1: కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పెంచిన పింఛన్లను పిఠాపురంలో ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్. జూలై 3: పిఠాపురంలో భూమి కొన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

ఆగస్టు 5: కొవ్వూరు మండలం కుమారదేవంలో నూట 150ఏళ్ల చరిత్ర కలిగిన సినిమా చెట్టు కూలింది.ఆగస్టు 16: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నక్యాంటీన్లు పునఃప్రారంభం

సెప్టెంబరు 5: వరదలతో ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక...కోనసీమకు వరద ముప్పు..పంపా రిజర్వాయర్‌కు పోటెత్తిన వరద. సెప్టెంబరు 8:రాజమహేంద్రవరం రిజర్వు ఫారెస్టులో చిరుత సంచారం.సెప్టెంబరు 11 : ఏలేరు వరద ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు పర్యటన

అక్టోబరు 19: జనసేనలో చేరిన ముద్రగడ పద్మనాభం కుమార్తె బార్లపూడి క్రాంతి. అక్టోబరు 22: ఆర్థిక ఇబ్బందులతో కోనసీమ జిల్లా అంబాజీపేటలో దంపతుల ఆత్మహత్య

నవంబరు 1: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉచిత గ్యాస్ బుకింగ్ ప్రారంభం. కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాకలో ముగ్గురు దారుణ హత్య.నవంబరు 9:రుడా చైర్మన్‌గా బీసీఆర్ చౌదరి..రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా కుడుపూడి సత్తిబాబు.నవంబరు 12: వైసీపీకి కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రాజీవ్‌కృష్ణ రాజీనామా.

డిసెంబరు 4: విలీన మండలాల్లో స్వల్ప భూప్రకంపనలతో బెంబేలెత్తిన ప్రజలు.డిసెంబరు 4: సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా ఉన్న పెందుర్తి వెంకటేశ్‌కి తొలిసారి క్యాబినెట్ హోదా కల్పించారు.డిసెంబరు 9: ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి గెలుపు డిసెంబరు 12: రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి విమానం సర్వీసులు..

కాకెత్తిన కాకినాడ 6

ఈ ఏడాదిలో ఒకే ఒక్క మాట ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా కాకినాడ పేరు మార్మోగేలా చేసింది. అదే స్టెల్లా నౌక.బియ్యం లోడింగ్ కోసం వచ్చిన నౌకలో రేషన్ బియ్యం పట్టుబడడంతో డిప్యూ టీ సీఎం పవన్ కాకినాడకు వచ్చి సీజ్ ద షిప్ అన్నారు.ఈ డైలాగ్ విపరీతంగా వైరల్ అయి ంది.దీనికి తగ్గట్టుగా కాకినాడ పోర్టు చరిత్రలో ఎప్పుడలేని విధంగా ఏకంగా 50 రోజులకు పైనే షిప్ నిలిచిపోవడం రాష్ట్ర వ్యాప్తంగా కాకినాడ పేరును మార్మోగేలా చేసింది. అటు రేషన్ బియ్యం స్మగ్లింగ్ వ్యవ హారంలోను కాకినాడ పోర్టు పేరు మోతె క్కింది.ఇక్కడి నుంచి విదేశాలకు తరలి పోయిన పేదల బియ్యం అంశం కొన్ని వారాలపాటు చర్చనీయాంశంగా మారింది.కాకినాడ సీపోర్టులో వాటాలను వైసీపీ నాయకులు గన్ పెట్టి బెదిరించి రాయించేసుకు న్నారన్న కేవీరావు ఫిర్యాదుతో మరోసారి తూర్పుగోదావరి జిల్లా పేరు చర్చనీయాంశం అయ్యేలా చేసింది.



వావ్ అనిపించేలా 7

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను అనేక మంది దేశరాజధాని ఢిల్లీకి వివిధ పనులపై వెళతారు.కానీ జిల్లా నుంచి నేరుగా విమానం లేదు. కానీ 2024 ఏడాది జిల్లావాసులకు ఆ లోటు తీర్చే సింది. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా ఢిల్లీకి ఇండిగో డిసెంబర్ నుంచి సర్వీ సులు ప్రారంభించింది. ఒకరకంగా జిల్లా ప్రజలకు ఇది తీపికబురు. అటు కాకినాడలో కొత్త ఎయిర్ పోర్టు, తుని-అన్నవరం మధ్య ఎయిర్‌పోర్టు లేదా ఎయిర్ స్ట్రిప్ నిర్మాణం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో సర్వత్రా విమాన ప్రయాణి కులకు కిక్ ఇచ్చి వావ్ అనిపించింది. కాకినాడలో డిసెంబర్‌లో నకిలీ పిస్టల్‌ను గురిపెట్టి ఓ జ్యూయలరీ దుకా ణంలో బంగారం చోరీ చేసి పారిపోతున్న నింది తుడిని పోలీసులు సినిమా ఫక్కీలో ఛేజ్ చేసి పట్టుకుని వావ్ అనిపించుకున్నారు.అన్నవరం లోను ఇలాగే బంగారంతో పారిపోతున్న ఓ నిందితుడిని స్థానికులు వెంబడించి పట్టుకున్నారు.



భయపెట్టిన పులులు.. 8

ఈ ఏడాది పులుల సంచారం ఉమ్మడి జిల్లా ప్రజలకు కంటిపైకునుకు లేకుండా చేశాయి. సెప్టెంబరులో రాజమహేంద్రవరం దివాన్‌చెరువు సమీపంలో పులి అడుగు జాడలు రాజమ హేంద్ర వరం వాసులను బెంబేలెత్తించాయి. కొన్ని వారాల పాటు పులి సంచారం ప్రజలను పరు గులు తీయించింది. బయటకు వస్తే ఏమవు తుందోననే భయంతో బిక్కుబిక్కుమన్నారు. ఆ పులి ఏమైందో తెలియదు కానీ..ఆ తర్వాత డిసెంబరులో ప్రత్తిపాడులో పులి సంచారం ప్రచారం జిల్లాను వణికించింది.



కొట్లాటకు సై కోడి రెడీ

మెట్టలో పందాలకు క్రేజ్



- సంక్రాంతి పందాలకు పుంజులు సిద్ధం
- ఫారాల నిర్వాహకులకు కాసులే.. కాసులు
- కోడిపుంజులు కొంటున్న పందెం రాయుళ్లు
- రూ.లక్షల్లో అమ్ముడవుతున్న పందెం పుంజులు
- ఉమ్మడి జిల్లాలో 300కి పైగా నాటుకోళ్ల ఫారాలు
- ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్న పుంజులు
- అధిక లాభాలు పొందుతున్న వ్యాపారులు

గండేపల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వస్తుందంటే కొత్త అల్లుళ్లతో గ్రామాలన్నీ సందడిగా మారతాయి. ముఖ్యంగా కోడిపందేలు అంటే ఎప్పటినుంచో సంప్రదాయంగా మారుతున్న క్రీడ ఇది. నాటుకోళ్ల ఫారాల వ్యాపారుల కూడా సంవత్సరానికి ఒకసారి కాసులు కురిపించే వ్యాపారమిది. ప్రస్తుతం సంక్రాంతి కూడా దగ్గరపడింది. ఇంకా నెలరోజుల్లో సంక్రాంతి ఉంది. దీంతో నాటుకోళ్ల నిర్వాహకులు ఇప్పటినుంచే సొమ్ములు చేసుకోవడం మొదలు పెట్టారు. సంక్రాంతి సమయానికి ముందే ఈ కోళ్ల విక్రయాలు చేసి సొమ్ములు చేసుకుంటారు. అధిక లాభాలు పొందుతారు. ఈ నెలరోజుల కాలంలోనే అధిక లాభాలు వస్తాయి. పుంజులకు పందెం రాయుళ్లు శిక్షణ ఇచ్చే పనిలో పడ్డారు. పుంజులకు గంట్లు, పచ్చి ఉల్లిపాయ ముక్కలు, మేకమాంసం పెడుతున్నారు. వాటికి చెరువుల్లో ఈత కొట్టిస్తూ శిక్షణ ఇస్తున్నారు. పందెంలో మన పుంజే గెలవాలనే తాపత్రాయంతో పుంజులను మేపుతున్నారు. కోడి పుంజుల్లో నెమలి, పచ్చకాకిలకు మంచి డిమాండ్ పలుకుతోంది. ఇప్పటికే కోళ్ల ఫారాలనుంచి ఏపీ, తెలంగాణకు సంబంధించిన పందెంరాయుళ్లు పుంజులను లక్షల్లో కొనుగోలు చేసినట్లు పలువురు ఫారం నిర్వాహకులు చెపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 300కిపైగా నాటుకోళ్ల ఫారాలు ఉన్నాయి. సంక్రాంతి పండుగ మూడురోజులు సంప్రదాయబద్ధంగా పందేలు నిర్వహిస్తారు. పందెంలో గెలిచిన కోస మాంసానికి మంచి డిమాండ్ పలుకుతుంది. దీంతో ఈ ఏడాది పందేలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.



పందెం పుంజులకు డిమాండ్

సంక్రాంతి దగ్గర పడడంతో నాటుకోళ్ల ఫారాల్లో ఉన్న పందెం పుంజులకు మంచి గిరాకీ ఉంది. రూ.25వేల నుంచి రూ.లక్ష వరకు పుంజుల ధర పలుకుతోంది. నాటుకోళ్ల ఫారం నిర్వాహకులు కోడిపుంజుల విక్రయాలు చేపడుతున్నారు. నెమలి రూ.40వేలు, పచ్చకాకి రూ.50వేలు, కాకిడేగ రూ.35వేలు, చేదువ రూ.50వేలు, కోడిడేగ రూ.25వేలు, రసంగి రూ.50వేలు, నల్లడేగ రూ.60వేలకు పైగా ధరలు పలుకుతున్నాయి. పుంజు రకాన్ని బట్టి పందెరాయుళ్ల కొనుగోలు చేస్తున్నారు. దీంతో పందెం పుంజులు మేపే నిర్వాహకులకు కాసులు కురిపిస్తున్నాయి.





- ఇతర రాష్ట్రాల నుంచి పందెంరాయుళ్ల రాక
- ట్రయల్ పందేలు నిర్వహిస్తున్న నిర్వాహకులు
- సిద్ధమవుతున్న బరులు
- రూ.లక్షల్లో పందాలు?

సామర్లకోట/జగ్గంపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని మెట్టప్రాంతంలో కోడిపుంజులు పందేలకు సిద్ధమవుతున్నాయి. ఇక్కడ జరిగే కోడి పందేలు చూసేందుకు తెలంగాణ, తమినాడు, ఒడిశా రాష్ట్రాలనుంచి జనం తరలివస్తుంటారు. రూ.లక్షల్లో పందేలు కూడా పడుతుంటారు. గతేడాది మూడురోజులకు కలిపి ఈ ఒక్క ప్రాంతంలోనే రూ.6కోట్ల పందేలు జరిగాయని చెప్తుంటారు. వచ్చే ఏడాది సంక్రాంతి సమయంలో జరిగే కోడిపందేలకు మెట్టప్రాంతంలోని జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం, తుని నియోజకర్గాలతోపాటు కాకినాడ, సామర్లకోట ల్లోను ఇప్పటికే బరులను సిద్ధం చేశారు. సవల, కొక్కిరాయి. రసంగి, సేతువ జాతి కోడిపుంజులకు డిమాండ్ బాగా ఉంది. కొందరు ఇప్పటికే వాటిని పెంపకం దారులనుంచి కొనుగోలు చేసి ట్రయల్ పందేలు నిర్వహిస్తున్నారు.



అద్దెకు ఈ-స్కూటర్లు

- స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రణాళిక
- కాకినాడ నగరంలో పది సెంటర్లలో ఏర్పాటు
- పొల్యూషన్, ట్రాఫిక్ నియంత్రణే లక్ష్యం

ఆంధ్రజ్యోతి/కార్పొరేషన్ (కాకినాడ): నగరంలో రోజురోజుకు పెరుగుతున్న పొల్యూషన్, ట్రాఫిక్ జామ్, వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని అధికారులు అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కాకినాడ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ-స్కూటర్లను రోజువారీ అవసరాలకు అద్దెప్రాతిపదికన నడిపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అందుకుగాను ఇప్పటికే 13 ఈ స్కూటర్లను భువనేశ్వర్ నుంచి దిగుమతి చేశారు. ఈ ప్రాజెక్టును ప్రజల ఎంతవరకు సద్వినియోగం చేసుకుంటారనే దానిపై ప్రజాభిప్రాయ సేకరణకు కాకినాడ నగరంలోని ప్రధాన జంక్షన్‌లో ఇప్పటికే డెమో నిర్వహించి ప్రజల దగ్గర నుంచి అభిప్రాయాలు సేకరించారు.



గతంలో నగరంలో ఎక్కడికైనా వెళ్లాలంటే రిక్షాలపై ప్రయాణించేవారు. తర్వాతకాలంలో వాటి స్థానంలో సిటీ బస్సులను ఆశ్రయించేవారు. ఆ తర్వాత ఆటోల రాకతో సిటీ బస్సులు కూడా కనుమరుగయ్యాయి. దీంతో నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో అదే స్థాయిలో పొల్యూషన్ కూడా పెరుగుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు పొల్యూషన్, ట్రాఫిక్ నియంత్రించేందుకు ఈ-స్కూటర్లను అద్దెప్రాతిపదికన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎవరికి ఏ అవసరమున్నా వాటిని రోజువారీ, నెలవారీ అద్దెకి తీసుకుని వాటిని ఉపయోగించుకోవచ్చని చెప్తున్నారు. ఇవి పూర్తిగా జీపీఎస్ కంట్రోల్‌లో ఉంటాయని, మనం ఎక్కడికి వెళ్లినా నిర్వాహకులకు తెలుస్తుందని, వాటిని దొంగిలించాలనుకున్నా నిర్వాహకులు ఈ బైకులను నియంత్రించగలరు. ఈ విధానం ఇప్పటికే బెంగుళూరు, చెన్నై వంటి ముఖ్య పట్టణాల్లో ఎక్కువగా స్విగ్గీ, జొమోటో వంటి డోర్ డెలివరీలకు నెలవారీ అద్దె ప్రాతిపదికన ఉపయోగిస్తున్నారు. నగరంలోని శివార్లలో ఉండే కళాశాలలకు, ఇతర అవసరాలకు వెళ్లాలంటే ఆటోలే దిక్కు. దీంతో అనేకమంది చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో అమ్మాయిలకైతే మరీ సమస్యగా ఉంటోంది. పోని చిన్నపాటి బైక్ ఏదైనా కొందామంటే ఖర్చుతో కూడుకున్న పని. వీటన్నింటికీ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ ఈ-బైక్‌ల ద్వారా పరిష్కారం చూపిస్తోంది.

ఫీచర్లు, రేంజ్..

ఈ-స్కూటర్‌ను రోజువారీగా 100 కిలోమీటర్ల కంటే ఎక్కువ పరిధి వరకు వినియోగించవచ్చు. సుదీర్ఘ ప్రయాణాల సమయంలో రైడర్ల సౌకర్యం, భద్రత కోసం ఈ-బైక్ ఎర్గోనామిక్స్‌ను కలిగి ఉంటుంది. స్లో స్పీడ్ ఎలక్ట్రిక్ వాహనం. దీని గరిష్ఠ వేగం గంటకు 25కిలోమీటర్లు. ఇందులో యాంటీ వాండలిజం, యాంటీథెఫ్ట్, కీలెస్ స్టార్ట్, జీపీఎస్ ట్రాకింగ్, బ్యాటరీ మెకానిజం వంటి ఫీచర్లు ఉన్నాయి.

బైక్‌ల ట్రయల్ లాంచ్

కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ అద్దె ప్రాతిపదికన ఈ బైక్ సేవను ప్లాన్ చేసింది. ముందుగా ప్రజల అభిప్రాయాలను సేకరించేందుకు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఈ సేవలు నగరవ్యాప్తంగా అమలు చేయడానికి సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి కాగా నగరంలో సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. దీనికిగాను నిర్వాహకులనుంచి టెండర్లు పిలిచ్చి కొత్త సంవత్సరంలో ఈ-బైక్‌లు అందుబాటులోకి తీసుకురానున్నారు.

ధ్రువపత్రాలు అవసరం

వాహనం కావాలనుకున్న వారు అధికారులు ఏర్పాటు చేసిన ఆయా సెంటర్లలో ఈ-బైక్‌లను అద్దెకు ఇచ్చే ముందు ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్సు, ప్రభుత్వం జారీ చేసి పాన్ కార్డు, ఓటర్ కార్డు, ఆధార్ వంటివి ఇవ్వాల్సి ఉంటుంది.

నగరంలో పదిచోట్ల సెంటర్లు

కాకినాడ నగరంలో పదిచోట్ల సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. రైల్వేస్టేషన్, జీజీహెచ్, ఆర్టీసీ కాంప్లెక్స్ భానుగుడి సెంటర్, సర్పవరం జంక్షన్, జగన్నాథపురం, ప్రతాప్‌నగర్ బ్రిడ్జి, ఎన్టీఆర్ బీచ్, ఎస్ఆర్ఎంటీ మాల్, డీమార్ట్ జంక్షన్లలో ఈబైక్‌ల సెంటర్లు ఏర్పాటుకు చేసేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు.



పట్టభద్రుల నియోజకవర్గానికి 3,15,261 మంది ఓటర్లు

● కాకినాడజిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో 3,15,261 మంది ఓటర్లు ఓటు నమోదు చేసుకున్నట్లు తూర్పు పశ్చిమగోదావరి పట్టభద్రుల నియోజకవర్గం ఓటు నమోదు అధికారి, కాకినాడజిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. సోమవారం ఓటర్లజాబితా తుది ప్రచురణ చేశామన్నారు. దీన్ని అల్లూరి సీతారామరాజుజిల్లా, డాక్టరు బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, తూర్పుగోదావరి జిల్లా, ఏలూరు జిల్లా, కాకినాడ జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాల్లో కలెక్టరేట్‌ల్లో ప్రదర్శన నిమిత్తం ఉంచామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో, ఆర్డీవో కార్యాలయాల్లో కూడా ప్రదర్శించామన్నారు. మొత్తం ఓటర్లు 3,15,261 మంది కాగా దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4664, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 64,327, తూర్పుగోదావరి జిల్లాలో 63,441, ఏలూరు జిల్లాలో 42,602, కాకినాడ జిల్లాలో 70,343, పశ్చిమగోదావరి జిల్లాలో 69,884 మంది ఓటర్లు ఉన్నారన్నారు.

రమణ మహర్షి బోధనలు అనుసరణీయం

రాచపల్లిలో ఘనంగా రమణమహర్షి 145వ జయంతి



రమణ మహర్షికి పూజలు చేస్తున్న భక్తులు



ప్రసంగిస్తున్న వాసుదేవానంద గిరిస్వామి, పాల్గొన్న భక్తులు

ప్రత్తిపాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో రమణ మహర్షి 145వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. రాచపల్లి రమణ ఆశ్రమంలో రమణ సేవాశ్రమ నిర్వాహకులు రమణానంద స్వామిజీ ఆధ్వర్యంలో రమణమహర్షివిగ్రహానికి భక్తులు పూజలు నిర్వహించారు. తొలుత ప్రణవ పతాకాన్ని వాసుదేవానందగిరి స్వామి ఆవిష్కరించారు. జ్యోతి ప్రజ్వలనను వత్సవాయి సుబ్బరాజు,దంతులూరి రామచంద్రరాజు, సుభద్రమమ్మలు చేయగా అక్షర మణిమాల ఉపదేశ పారాయణాన్ని సిరిపురం రమణ సత్సాంగ నిర్వాహకులు నిర్వహించారు. గోమాత పూజను మదినే శ్రీనివాసరావు-భద్రలక్ష్మి, మాణిక్యాలరావు-లక్ష్మీతులసి నిర్వహించగా భగవాన్ రమణమహర్షి అష్టోత్తర శత నామ అర్చనను, శ్రీ సారాయాగాన్ని బ్రహ్మశ్రీ ఆకుండి కృష్ణ ప్రకాష్‌శర్మ నిర్వహించారు. పుష్ప మాలాంకరణ,తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆలయ ప్రముఖులు బుద్దరాజు చంటిరాజు, రామలక్ష్మి, అన్నవరం దేవస్థానంమాజీ పాలక మండలి సభ్యులు బుద్దరాజు గోపిరాజు, వైస్ ఎంపీపీ బొంకు శ్రీను, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, మినర్వా విద్యాసంస్థల అధినేత డీవీఎస్ రమేష్ రాజులు నిర్వహించారు.

'రమణతత్వంతోనే మానసిక ప్రశాంతత'

రమణతత్వంతోనే మానసిక ప్రశాంతత కలిగి సమాజానికి మేలు చేకూరుతుందని శ్రీ విద్యాపీఠం పీఠాధిపతి వాసుదేవానందగిరి స్వామి అన్నారు. రమణ మహర్షిజయంతి సభకు రామానందస్వామి అధ్యక్షత వహించగా వాసుదేవానంద గిరి స్వామి మాట్లాడుతూ రమణ మహర్షి బోధనలు ఆచరణదాయకమన్నారు. ఈ ఆధ్యాత్మిక సభలో ఇంకా కాకినాడ ఆదిగురు యోగాపీఠాధిపతి సత్‌గురుసత్యాదానంద యోగి, శాంతి ఆశ్రమం మాతాజీ వినంబ్రనంద సరస్వతి, వంగలపూడి సద్గురు సేవా శ్రమ పీఠాధిపతి నిర్విశేషానంద మా తాజీ, లలిత గీతాశ్రమ పీఠాధిపతి విజ్ఞానందగిరి మాతాజీ ముఖ్యఅతిథులుగా హాజరై భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం భారీ ఎత్తున్న అన్న సంతర్పణ నిర్వహించారు.

నూతన సంవత్సర వేడుకలకు పూలబొకేలు సిద్ధం







కడియం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పూలకు నిలయమైన కడియపులంక, కడియపుసావరం, కడియం గ్రామాల్లో పూలడెకరేటర్లు గత కొద్దిరోజుల నుంచి పూలబొక్కేల తయారీలో బిజీబిజీగా ఉన్నారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ ప్రతీఒక్కరూ పూలబొక్కేలు ఇచ్చి 'హేపీ న్యూఇయర్' అంటూ శుభాకాంక్షలు చెప్పడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధానంగా కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్, కడియం, కడియపుసావరం, బుర్రిలంక గ్రామాలకు చెందిన పూల వ్యాపారులు పూలబొక్కేలను తయారు చేస్తుంటారు. కొంతమంది పూలబొక్కేలను ముందుగా ఆర్డరు ఇచ్చి తయారు చేయమని చెబుతుంటారు. అలా తయారుచేసిన పూలబొక్కేలను ఆయా ప్రాంతాలకు పంపిస్తుంటారు. జర్బెరా, ఆర్కిడ్స్, స్నోబాల్, కార్నిషన్, గ్లాడియేటర్,డచ్‌రోజెస్, క్రిసాంతిమం పూలను బెంగుళూరు, ఊటీ తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న పూలతో వేల విలువచేసే బొకేలు తయారు చేస్తుంటారు.

2న అండర్-12 బాలుర ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

కాకినాడ అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాశాఖ ఆధ్వర్యంలో జనవరి 2న ఉమ్మడి జిల్లా అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక కాకినాడ ఆర్ఎంసీ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పీఎస్ సత్యనారాయణ తెలిపారు. హాజరయ్యే బాలురు 2012, సెప్టెంబరు 1నుంచి 2015, ఆగస్టు 31లోపు జన్మించినవారై ఉండాలన్నారు. హాజరయ్యేవారు తెల్లని వస్త్రాలు, బూట్లు ధరించి రావాలన్నారు.



మార్కెట్లో రంగుల అమ్మకాలు

అనపర్తి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకల నుంచి సంక్రాతి వరకు పల్లె లోగిళ్ల రంగుల రంగుల రంగవల్లులతో మెరవాల్సిందే. నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ అతివలు తమ ఇంటి వాకిట్లో నూతన సంంత్సరానికి స్వాగతం పలుకుతూ రంగు రంగుల రంగవల్లులతో స్వాగతం పలికేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు వేయాల్సిన రంగవల్లుల నుండి బోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలవరకు ఏరోజు ఏరంగవల్లిని వే యాలో అతివలు పేపర్లపై ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. మంగళవారం అర్ధరాత్రికి పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఇంటి ముంగిళ్లలో రంగులు వేసేందుకు ఇప్పటికే మహిళలు రంగులు కొనుగోలులో బిజీ బిజీగా ఉన్నారు. దీనితో పలువురు వ్యాపారులు తోపుడు బళ్ళపై అమ్మకాలు సాగిస్తున్నారు. అనపర్తిమార్కెట్లో సుమారు 15 వరకు తోపుడు బండ్ల దుకాణాలు వెలవగా వీధుల్లో మరో పది పదిహేను తోపుడు బండ్ల వర్తకులు వ్యాపారం సాగిస్తున్నారు. దుకాణాలు పెరిగిపోవడంతో ఆశించినమేర బేరాలు జరగడం లేదని చిల్లర వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శబ్దకాలుష్యాన్ని సృష్టిస్తున్న

502 బైక్ సైలెన్సర్లు ధ్వంసం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 502బైక్ సైలెన్సర్లు ధ్వంసం చేశారు. స్థానిక జాంపేట పోలీస్ ఫంక్షన్ హాలు వెలుపుల సోమవారం బైక్ సైలెన్సర్లను రోడ్డుపై వేసి రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ట్రాఫిక్ సీఐలు నబీ, సూరిబాబులు, ట్రాఫిక్ ఎస్ఐలు సిబ్బంది కలిసి జిల్లా అంతటా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అధికశబ్ధం కలిగిన సైలెన్సర్లను బైక్ నుంచి తీయించి ధ్వంసం చేశారు. ఎస్పీ నరసింహకిషోర్ మాట్లాడుతూ ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని, సైలెన్సర్లు విక్రయించే షాపులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బైక్ సైలెన్సర్లను రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేస్తున్న పోలీసులు

సత్యదేవుడి హుండీల ఆదాయం
రూ.1.52 కోట్లు



హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల నుంచి అన్నవరం సత్యదేవుడి సన్నిధికి విచ్చేసిన భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రూ.1,52,58,438 నగదు, 16.8 గ్రాముల బంగారం, 745 గ్రాముల వెండి సమకూరాయి. వీటితో పాటుగా యూఎస్‌ఏకు చెందిన 1901 డాలర్లు, మలేషియా 105, సౌదీఅరేబియా 1230, మరి కొన్ని విదేశీ కరెన్సీ లభ్యమయ్యాయి. లెక్కింపును ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లు పర్యవేక్షించగా సిబ్బంది లెక్కించారు. 28రోజులకు ఈ ఆదాయం సమకూరగా సరాసరిన రోజుకు భక్తులు రూ.5.44 లక్షలు కానుకల రూపంలో హుండీలలో వేసినట్టు ఈవో సుబ్బారావు తెలిపారు.

బంధువే.. బలి తీసుకున్నాడు



రక్తపు మడుగులో మృతిచెందిన బాలుడు

బాలుడిని నరికి చంపిన కిరాతకుడు
మద్దిమడుగు గ్రామంలో ఘటన

ఎటపాక, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీలోని ఆదివాసీ గ్రామమైన మద్దిమడుగులో సోమవారం సాయంత్రం ఓ బాలుడిని సమీప బంధువు గొడ్డలితో నరికి చంపాడు. తెలంగాణ రాష్ట్ర భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం కోయనరసాపురానికి చెందిన ముర్రం కోటేశ్ తన బంధువైన కణితి నాగరాజు(4)ని పత్తి చేను వద్ద గొడ్డలితో నరికి చంపాడు. ఇది చూసిన మరో బాలుడు గ్రామంలో చెప్పడంతో విషయం వెలుగుచూసింది. కాగా హంతకుడు, హత్యకు గురైన బాలుడు కోయనరసాపురానికి చెందినవారే. కొన్నేళ్ల క్రితం కోటేశు, నాగరాజు తండ్రి కుటుంబాలు పోడు వ్యవసాయం కోసం మద్దిమడుగు ప్రాంతానికి వలసవెళ్లారు. 2 కుటుంబాల మధ్య అప్పుడప్పుడూ గొడవలు జరగడం, పెద్ద మనుషులు కలుగజేసుకుని రాజీ చేయడం జరిగేవని తెలుస్తోంది. కాగా కోటేశ్ మానసిక స్థితి సరిగ్గా లేక హత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. సంఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. కోటేశ్ పరారైనట్టు సమాచారం.

రంప ఏరియా ఆసుపత్రిలో గర్భిణి మృతి

విచారణకు ఆదేశించిన ఐటీడీఏ పీవో

రంపచోడవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో నిండు గర్భిణి మృతి చెందింది. మండలంలోని ఆకూరు పంచాయతీ కొయ్యలగూడెం గ్రామానికి చెందిన తెల్లం లక్ష్మిని ప్రసవం కోసం ఆమె భర్త వెంకన్నదొర శుక్రవారం రంప ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చాడు. శనివారం ఆమె పుట్టినరోజు కావడంతో ఇంటికి తీసుకెళ్లి మళ్లీ పురిటి నొప్పులు రావడంతో రాత్రి ఆసుపత్రికి తీసుకొచ్చాడు. ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో అధికంగా రక్తస్రావమైంది. ఆ సమయంలో ఇద్దరు గైనకాలజిస్టులూ లేరు. డ్యూటీలో ఉన్న చిన్న పిల్లల డాక్టర్ ఆది లక్ష్మి వైద్యం అందించేలోపే లక్ష్మి మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే ఇలాజరిగిందని భర్త వెంకన్నదొర ఆరోపించాడు. సమయానికి వైద్యం అందించి ఉంటే తల్లి, బిడ్డ బతికి ఉండేవారని, పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. కాగా గర్భిణి మృతిపై విచారణ అధికారిగా సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీని నియమించినట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. సోమవారం ఆయన సబ్ కలెక్టర్‌తో కలిసి ఆసుపత్రిని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులు, వైద్యాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందని, గైనకాలజిస్టు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.



మృతురాలు తెల్లం లక్ష్మి

5 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్ట్

కరప, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కరప మండలం నడకుదురులో సోమవారం పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ తోట సునీత తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నడకుదురులో గంజాయి రవాణా జరుగుతున్నట్టు సమాచారం అందడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. నడకుదురు పూర్ణ ఫంక్షన్‌హాల్ వెనుక అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులది ఒడిస్సా రాష్ట్రం మల్కాన్గిరి జిల్లా కోరుకొండ మండలం గుంటవాడ గ్రామానికి చెందిన కీల్లో శ్రీను, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మండల కేంద్రం దుంబ్రీగూడ గ్రామానికి చెందిన గలేళ్ల రమేష్ అలియాస్ విష్ణుగా గుర్తించారు. ఒడిస్సా రాష్ట్రం నుంచి కర్నాటక రాష్ట్రంలోని బెంగుళూరుకు గంజాయిని తరలిస్తున్నట్టు విచారణలో తేలింది. నిందితుల నుంచి 3 ప్యాకెట్లలో ఉన్న రూ.25వేలు విలువచేసే గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. ఏఎస్ఐ సూరిబాబు, డిప్యూటీ తహశీల్దార్ దుర్గాప్రసాద్, వీఆర్వోలు కుంపట్ల గణపతి, చాగంటి వరుణ్, పోలీసులు పాల్గొన్నారు.

350 గ్రాముల బంగారం, రూ.2లక్షలు చోరీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండల పరిధిలోని బొమ్మూరు బాలాజీపేట సమీపంలోని రామకృష్ణనగర్‌లో ఒక ఇంట్లో దొంగలు పడ్డారు. బొమ్మూరు పోలీసుల వివరాల ప్రకారం... రామకృష్ణనగర్‌కు చెందిన గరగ అనంతలక్ష్మి జిల్లా కలెక్టర్ కార్యాయలంలో కోఆర్డినేషన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 26న కాకినాడలో బంధువులు మరణించడంలో కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళాలు వేసుకుని ఊరు వెళ్లారు. తిరిగి ఈనెల 29 రాత్రి రామకృష్ణ నగర్ చేరుకున్నారు. ఇంటి తాళలతో పాటు బీరువా డోరు పగులు కొట్టి ఉంది. బీరువాలో 350 గ్రాముల బంగారు వస్తువులు, రూ.2లక్షలు నగదు కనిపించకపోవడంతో బాధితురాలు బొమ్మూరు పోలీసులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీ కే(ర్)క్!



- రంగురంగుల కేక్‌లు.. అనారోగ్య కారకాలు
- కృత్రిమ రంగులు కలిపి విచ్చలవిడిగా విక్రయాలు
- తూతూమంత్రంగా ఆహార భద్రత అధికారుల తనిఖీలు

పెద్దాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కేక్ ట్రెండ్ నడుస్తోంది. పండగైనా, పుట్టినరోజైనా, పెళ్లయినా, వార్షికోత్సవమైన, విజయోత్సవమైనా ఏదైనా వస్తువ, వాహనం, యంత్రం కొనుగోలు చేసినా మొదట కేక్ కట్ చేయడం ఆనవాయితీగా మారింది. ఈ పరిస్థితుల్లో వినియోగదారులను ఆకర్షించేందుకు ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులను కలపడం కూడా ఇటీవల అధికమయ్యింది. వాటిని తింటే మధుమేహం, బీపీతో పాటు ప్రాణాంతక వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కల్తీ ప్రమాదకర ఆహారం నుంచి ప్రజలను రక్షించడానికి ఎన్నో చట్టాలు ఉన్నాయి. అధికారులు మాత్రం వాటిని అమలుచేయట్లేదు. కొంతమంది వ్యాపారుల స్వార్థం, మరికొంతమందికి అవగాహన లేక కృత్రిమ రంగులు కలిపిన ఆహార పదార్థాలను తయారుచేసి విక్రయిస్తున్నారు. తద్వారా ప్రజలా ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. కేక్‌లలో రంగులు అధికంగా కలుపుతున్నట్టు తెలుస్తోంది.

నిబంధనల అమలు అంతంతే...

స్వీటు షాపు నిర్వాహకులు ఎక్కువమంది ఫుడ్ లైసెన్స్ తీసుకోకుండా చాటుమటున అమ్మకాలు చేస్తుంటారు. కేక్‌లు, స్వీట్లు కవర్లు బాక్సులపై వాటి తయారు తేదీ కచ్చితంగా ముద్రించాలి. స్వీట్లు తయారీలో తప్పనిసరిగా సరి చూసుకోవాలి. చాలా చోట్ల కేక్‌లు, స్వీట్లు తయారీలో అనుమతులు లేని రంగుల వాడుతున్నట్టు తెలుస్తోంది. ఆహార భద్రతాధికారులు తూతూమంత్రంగా దాడులు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. గడచిన ఏడాదికాలంలో ఆహార భద్రతా అధికారులకు ఫిర్యాదులు చేశామని కానీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు చెబుతున్నారు.



అద్దాల మేడల్లో అందమైన విషం..

ఇటీవల కార్పొరేట్ స్థాయిలో అద్దాల మేడలుగా ఏర్పాటు చేసి అందులో రంగురంగుల కేక్‌లు నిల్వ ఉంచుతున్నారు. కొన్నాళ్ల క్రితం వరకూ స్థానికులు బేకరీలు నిర్వహించేవారు. కొంతమంది కార్పొరేట్ స్థాయిలో పట్టణాల్లో భారీ ఎత్తున బేకరీలు ఏర్పాటు చేసి అద్దాల నీడలో కేక్‌లను ఉంచుతూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. అక్కడ చూస్తే ఎవరికైనా కేక్ కొనాలనిపిస్తుంది. వాటిలో వారం పదిరోజులుగా నిల్వ ఉంచినవి కూడా ఉంటున్నాయని జనం వాపోతున్నారు. ప్రజలకు తెలియకుండా అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారని వైద్యులు సైతం చెబుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్వీట్లు, కేక్‌లు తయారుచేసే షాపులు వందల్లో ఉన్నాయి. వీటి ద్వారా నిత్యం రూ.లక్షలాది వ్యాపారం సాగుతోంది. కొన్నిరకాల బ్రాండ్ల పేరుతో ఉన్న షాపుల్లో ఇతర ప్రాంతాల నుంచి స్వీట్లు దిగుమతి చేసుకుని విక్రయిస్తుంటారు. కేక్‌లు, స్వీట్లు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్త వహించాలి. లేదంటే అనారోగ్యం బారినపడక తప్పదు.



బూరుగుపూడిలో రేవ్ పార్టీ

ఒక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు
13 మంది యువకులు, ఐదుగురు యువతుల అరెస్టు



బూరుగుపూడి నాగసాయి ఫంక్షన్ హాల్లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యకిషోర్

కోరుకొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న రేవ్ పార్టీపై పోలీసులు దాడి చేసి 18 మందిని అదుపులోకి తీసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ పోలీస్‌స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యకిషోర్ సోమవారం మధ్యాహ్నం వివరాలను వెల్లడించారు. ఈ నెల 27న గుజరాత్ మైక్రో న్యూట్రీషియన్ కంపెనీకి చెందిన సేల్స్ ఎగ్జిక్యూటివ్ గోపాలకృష్ణ రూ.18 వేలకు కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్ వద్ద ఉన్న ఏబీఆర్ ఇన్‌ఫ్రా నాగసాయిరాం ఫంక్షన్ హాల్ బుక్ చేసి ఆదివారం అర్ధరాత్రి రేవ్ పార్టీ ఏర్పాటు చేశారు. ఇక్కడికి పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, తణుకు, ఆచంట తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం, ధవళేశ్వరం ప్రాంతాలకు చెందిన 10 మంది ఎరువుల డీలర్లను రప్పించారు. గోపాలకృష్ణకు పరిచయం ఉన్న కాకినాడకు చెందిన అను అనే అమ్మాయి ద్వారా ముగ్గురు యువతులను రంపచోడవరం, ధవళేశ్వరం ప్రాంతాల నుంచి ఇద్దరు మొత్తం ఐదుగురు యువతులను ఆదివారం రాత్రి ఫంక్షన్ హాల్‌కు రప్పించారు. ఫంక్షన్ హాలులో రూ.15 వేలకు 5 రూమ్‌లు బుక్ చేశారు. వారందరూ మద్యం తాగుతూ అమ్మాయిలతో డ్యాన్స్‌లు చేస్తూ ఎంజాయ్ చేస్తున్న సమయంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌కి వచ్చిన సమాచారం మేరకు స్పెషల్ పోలీస్, లోకల్ పోలీసులు ఫంక్షన్ హాల్‌పై రైడ్ చేశారు. అక్కడ ఉన్న 13 మంది యువకులు, ఐదుగురు యువతులను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ తెలిపారు. యువతులను వైద్య పరీక్షల నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. ఫంక్షన్ హాల్ యజమాని సత్తి భామిరెడ్డి పరారీలో ఉండడంతో కుమారుడు రామిరెడ్డి, వివిధ ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చిన ట్యాక్సీ డ్రైవర్, సూత్రధారుడైన గోపాలకృష్ణ, 10 మంది ఎరువుల డీలర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసుకున్న సౌండ్ సిస్టమ్, రూ.61 వేలు నగదు, గోపాలకృష్ణ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో ఇద్దరు యువతులను రూమ్‌ల్లో పట్టుకున్నామన్నారు. కేసు లోతుగా విచారణ జరుగుతుందన్నారు. సమావేశంలో కోరుకొండ ఇన్‌చార్జ్ ఎస్ఐ ఎండీ అశ్వాక్ ఉన్నారు.

నిర్వాహకులను అరెస్టు చేశాం : ఎస్పీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బూరుగుపూడి జంక్షన్ వద్ద నిర్వహించింది రేవ్ పార్టీ కాదని అక్కడ మహిళలతో కొంత మంది పార్టీ చేసుకుంటున్నట్టు తెలిసి దాడి చేసి నిర్వాహకులతో పాటు 13 మందిని అరెస్టు చేశామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అసభ్యకరంగా పార్టీలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గోదావరిలో పడి...

యువకుడి గల్లంతు
బయటపడిన మరో యవకుడు

ముమ్మిడివరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ము రమళ-పల్లంకుర్రు ఏటిగట్టు రోడ్డులో మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు అదుపు తప్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అయినాపురం అవుట్ ఫాల్ స్లూయిజ్ వద్ద గోదావరి పాయలో పడ్డారు. ఒక యువకుడు గల్లంతు కాగా మరో యువకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఉప్పలగుప్తం మండలానికి చెందిన పెయ్యల స్టీఫెన్, దోనిపాటి అభిషేక్ సోమవారం రాత్రి యానాం వెళ్లి తమ స్వగ్రామానికి తిరిగివస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అభిషేక్ మోటార్‌సైకిల్ నడుపుతుండగా స్టీఫెన్ వెనుక కూర్చున్నాడు. అయినా పురం అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద మోటార్ సైకిల్ చెట్టును ఢీకొనడంతో అభిషేక్ గోదావరి పాయలో పడి గల్లంతయ్యాడు. స్టీఫెన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అభిషేక్ కోసం పోలీసులు, స్థానికులు గాలింపు చేపట్టారు.



బయటపడిన స్టీఫెన్

'న్యాయవాదులపై పోలీసుల దురుసు ప్రవర్తన తగదు'

పిఠాపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై పోలీసుల దురుసు ప్రవర్తన తగదని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ధర్మారెడ్డి, జీఎస్ భాస్కరాచార్యులు అన్నారు. అనంతపురం జిల్లా త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో తమ పరిధిని దాటి సివిల్ వివాదంలో జోక్యం చేసుకుని న్యాయవాది శేషాద్రి పట్ల దురుసుగా ప్రవర్తించి అతడి మరణానికి కారణమయ్యారని తెలిపారు. న్యాయవాదులపై పోలీసుల దౌర్జన్యాలపై సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనితలు స్పందించి తక్షణం విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆక్వా రైతులకు నాబార్డు రుణాలు

గోదావరి జిల్లాల ఆక్వా ప్రాంతీయ సదస్సులో నాబార్డు, మత్స్యశాఖ అధికారులు



సదస్సులో మాట్లాడుతున్న నాబార్డు సీజీఎం

రాజమహేంద్రవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగంలో చిన్న, మధ్యతరగతి రైతులతోపాటు కార్పొరేట్ రంగానికి నాబార్డు రుణాలు ఇస్తున్నట్టు నాబార్డు సీజీఎం ఎం.ఆర్.గోపాల్ తెలిపారు. రాజమహేంద్రవరంలోని లాహాస్పిన్‌లో సోమవారం మత్స్యశాఖ, నాబార్డు ఆధ్వర్యంలో జరిగిన గోదావరి జిల్లాల ఆక్వా రైతుల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. చేపలు, రొయ్యల సాగు చేస్తున్న రైతులకు నాబార్డు ఆసరాగా ఉందన్నారు. భారతదేశంలో రొయ్యల పెంపకం, ప్రాసెసింగ్, ఎగుమతి రంగాలకు సంబంధించి నాబార్డు రుణాలు ఇవ్వడానికి వ్యూహ రచన చేస్తున్నట్టు చెప్పారు. దేశంలో 70 శాతం ఆక్వా, మత్స్య ఉత్పత్తి ఆంధ్రప్రదేశ్‌లో ఉందన్నారు. రాష్ట్రంలో 974 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉండడం వల్ల ఫిషరీస్ ఎగుమతుల్లో రికార్డుస్థాయి వృద్ధి నమోదైందన్నారు. ప్రతి కుటుంబం నుంచి వ్యాపారవేత్తలు తయారీ లక్ష్యంతో సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర2047లో భాగంగా పనిచేస్తున్నామన్నారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లాల్ మహ్మద్ మాట్లాడుతూ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలోనే 70 శాతం ఆక్వా కల్చర్ సాగు ఉందన్నారు. 540 34 మంది రైతులకు విద్యుత్ రాయితీలు అందిస్తున్నట్టు చెప్పారు. సదస్సులో నాబార్డు సీజీఎం డా.ఏ.వి.భవానీ శంకర్, ఎస్ఎల్‌బీసీ ఏజీఎం శ్రీనివాసదాస్యం, ఏజీఎం ఎస్ఎల్‌బిసి శ్రీనివాస్, డా.ఏవీ.మాధురి, ఐసీఏఆర్ -సీఎం ఎఫ్ఆర్ఐ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.జెకె. కిజాకుడన్, ఎంపీఈడీఏ జాయింట్ డైరెక్టర్ విజయకుమార్ ఎరగల్ పాల్గొన్నారు.



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి

కానిస్టేబుల్ అభ్యర్థులకు
దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం

కాకినాడ క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సివిల్, ఏపీఎస్పీ ఐఆర్ కానిస్టేబుళ్ల నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు సోమవారం కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. తొలిరోజు 273 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకాగా తదుపరి పరీక్షకు 163మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం దేహదారుఢ్య పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షలను కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పర్యవేక్షించారు.



అభ్యర్థి ఎత్తు కొలుస్తున్న దృశ్యం

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మానేపల్లి హైస్కూల్లో వక్కలంక రామారావు ప్రతిభా పురస్కారాల పంపిణీ



ప్రతిభా పురస్కారాలు అందుకుంటున్న విద్యార్థులు

పి.గన్నవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైతిక విలువలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విశ్రాంత జిల్లా ఉపవిద్యా శాఖాధికారి మైలవరపు రవీంద్రనాథ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మానేపల్లి బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం వక్కలంక రామారావు ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటసూర్యనారాయణమూర్తి అధ్యక్షత వహించగా రవీంద్రనాథ్ మాట్లాడారు. మానేపల్లి హైస్కూల్లో వక్కలంక రామారావు ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం పనిచేశారని, ఆయనకు ఈ ప్రాంతంతో విడదీయరాని బంధం ఉందన్నారు. ఆయనతో కలిసి పనిచేసిన అనుభవం నాకు కూడా ఉందని పాత జ్ఞాపకాలను విద్యార్థులతో పంచుకున్నారు. మానేపల్లి హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో, వివిధ హోదాల్లో పనిచేస్తున్నారన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకే పాఠశాల పూర్వ విద్యార్థులైన రామారావు తనయులు గత ఎనిమిదేళ్లుగా ఈ ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే ప్రతి ఏడాది ఏడో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందిస్తున్నారని ఆయన చెప్పారు. అలాగే బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాలిదేవర శ్రీనివాసరావు, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వి.సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ వక్కలంక రామారావు ప్రతిభా పురస్కారాలు ప్రతి ఏడాది విద్యార్థులకు ఆయన తనయులు అందించడం అభినందనీయమన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలుర పాఠశాల విద్యార్థి గోగు వెస్లేరాజు, బాలికల పాఠశాల విద్యార్థిని మోకా రక్షితకు రూ.5వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో హైస్కూలు చైర్మన్లు జోగి కుమారకృష్ణ, కొమ్ముల రమాదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు గోగు దేవరాజు, మోకా సూర్యకుమారి పాల్గొన్నారు.

2న శ్రీనివాస కల్యాణ మహాయజ్ఞం

పెద్దాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌బీ కొత్తూరులో జనవరి 2న శ్రీఅమ్మఒడి సేవా తరంగిణి ఆధ్యాత్మిక, ధార్మిక, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 108 ఉచిత శ్రీనివాస కల్యాణ మహాయజ్ఞం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 8374599667, 6305666038, 9866171712లో సంప్రదించాలన్నారు.

మద్యం వద్దు - ఆరోగ్యమే ముందు

• నూతన సంవత్సర వేడుకల్లో మద్యానికి దూరంగా ఉండాలని అవగాహన ర్యాలీలు • పోలీసుల హెచ్చరికలు




గొల్లప్రోలులో ర్యాలీ నిర్వహిస్తున్న మద్యపాన వ్యతిరేక ప్రచారసమితి, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు, పిఠాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గొల్లప్రోలు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో మద్యానికి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరుతూ మద్యపాన వ్యతిరేక ప్రచారసమితి ఆధ్వర్యంలో గొల్లప్రోలులో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఈ ర్యాలీని గొల్లప్రోలు తహశీల్దార్ సత్యనారాయణ ప్రారంభించారు. మద్యం లేని నూతన సంవత్సర వేడుకలు జరుపుకుందాం, మాయదారిని మద్యానికి దూరంగా ఉందాం, మద్యం వద్దు- ఆరోగ్యమే ముందు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా మద్యపాన వ్యతిరేక ప్రచారసమితి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ కొత్త సంవత్సరాన్ని స్వాగతించే సమయానికి కుటుంబసభ్యులతో ఆనందంగా గడిపి వారి మధ్యే వేడుకలు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వాలకు ప్రజలపై నిజంగా ప్రేమ ఉంటే డిసెంబరు 31వ తేదీ రాత్రి మద్యం షాపులు మూసివేయాలని డిమాండ్ చేశారు. మద్యం వల్ల ఎన్నో జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయని తెలిపారు. ర్యాలీలో జనవిజ్ఞాన వేదిక మండలాధ్యక్ష, గౌరవాధ్యక్షులు యేలేటి నానిబాబు, దాడి పద్మనాభం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరాజు, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి వడ్డి కాసులు అప్పారావు ఉన్నారు.

పిఠాపురం: కొత్త సంవత్సరాన్ని స్వాగతించే వేళ మద్యం లేని వేడుకలు జరుపుకుందామని డాక్టర్ పీఎస్ రాజు సూచించారు. మద్యానికి దూరంగా నూతన సంవత్సరాన్ని స్వాగతించే వేడుకలను జరుపుకోవాలని సూచిస్తూ మద్యపాన వ్యతిరేక ప్రచారసమితి, జనవిజ్ఞాన వేదికల ఆధ్వర్యంలో కళాశాలల విద్యార్థులు సోమవారం సాయంత్రం నిర్వహించిన ప్రదర్శనను పిఠాపురంలో మారెళ్లమ్మ తల్లి గుడి వద్ద ఆయన ప్రారంభించారు. ఇందిరానగర్ పరిసర ప్రాంతాల్లో ర్యాలీ సాగింది. మద్యం వల్ల కలిగే అనర్థాలను డాక్టర్ రాజు వివరించారు. సమితి నాయకులు సూర్యనారాయణ, కరణం విశ్వనాథం, అప్పారావు, నవచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఉన్నారు.

తాళ్లరేవు: నూతన సంవత్సరం సందర్భంగా మండలంలో ప్రజలు, యువకులు వేడుకలకు దూరంగా ఉండాలని కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, వేడుకల్లో మద్యం తాగినా, పేకాటలు ఆడినా శిక్షార్హులన్నారు. వాహనాలు వేగంగా నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలంతా తమ ఇళ్లల్లో కుటుంబాలతో వేడుకలు చేసుకోవాలని ఆయన కోరారు.

కొత్తపల్లి: నూతన సంవత్సరం సందర్భంగా రోడ్లపై మద్యం తాగి అల్లర్లు చేస్తే చర్యలు తప్పవని కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ హెచ్చరించారు. రోడ్లపై గుంపులుగా సంచరించడం, డీజే డాన్సులు, అర్ధరాత్రి వరకు సంచరించరాదన్నారు.

కాకినాడ క్రైం: నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా సాగాలని కాకినాడ త్రీటౌన్ సిఐ సత్యనారాయణ అన్నారు. త్రీటౌన్ పరిధిలోని హోటళ్ల యాజమాన్యం, లాడ్జిల యాజమాన్యానికి వారు అవలబించాల్సిన నియమ నిబంధనల గురించి సూచించారు. లాడ్జిల్లో అశ్లీల నృత్యం, జూదం, మద్యం తాగడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మద్యంమత్తులో వాహనాలు నడిపినా, బైక్ రేస్, కారు రేస్ నిర్వహించిన అనుమతి లేకుండా డీజే సౌండ్ పెట్టిన చర్యలు తప్పవన్నారు.

కేంద్ర మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

కలెక్టరేట్ వద్ద వామపక్షాల నిరసన

పలుచోట్ల ఆందోళనలు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల దేశవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం ఉదయం కాకినాడ కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి వామపక్షాల నాయకులు పూలమాల వేసి జోహార్లు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, సీపీఐ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్లమెంటులో అమిత్‌షా వ్యాఖ్యలు యథాలాపంగా అన్నవి కాదని బీజేపీ ఉద్దేశపూర్వకంగానే రాజ్యాంగంపై దాడి చేస్తోందన్నారు. పార్లమెంట్ అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ లిబరేషన్ నాయకులు నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజుబాబు, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు కొంకి రవి, దళిత సంఘాల నేతలు అయితాబత్తుల రామేశ్వరరావు, సీపీఐ నాయకులు తోకల ప్రసాద్, పప్పు ఆదినారాయణ, బొజ్జ అశోక్,రామారావు పాల్గొన్నారు.

పెద్దాపురం: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను తక్షణం బర్తరఫ్ చేయాలని పలువురు సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ జంక్షన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతను అవమానించడం ప్రతీ ఒక్కరికీ అలవాటుగా మారిపోయిందన్నారు. అమిత్‌షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాకూబ్, కామరాజు, రాంబాబు, దుర్గాప్రసాద్, నీలపాల సూరిబాబు, అప్పన్న, సిరిపురపు శ్రీనివాస్, కృష్ణ, వీర్రాజు, నరసింహమూర్తి పాల్గొన్నారు. సీపీఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో అమిత్ షా రాజీనామా చేయాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జనార్థన్, లచ్చబాబు, నారాయణమూర్తి, లక్ష్మీ, రత్నం, అప్పలరాజు పాల్గొన్నారు.

కొత్తపల్లి: సీపీఐ(ఎంఎల్)లిబరేషన్, సీపీఎం వామపక్షాల ఆధ్వర్యంలో కొత్తపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా హోం మంత్రి పదవికి రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు జి.బేబీరాణి, లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు గొడుగు డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి గురాల అప్పారెడ్డి, చంద్రమల్ల పద్మ, లిబరేషన్ మండల కార్యదర్శి శీలం అప్పలరాజు, కాళ్ల నాగేశ్వరరావు, చీకట్ల సాంబశివ, వజ్రం శ్రీను, నారాయణరెడ్డి, వాసు, సుబ్రహ్మణ్యం, గంగాధర్ పాల్గొన్నారు.

సామర్లకోట: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను తక్షణం కేంద్రమంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని పట్టణ సీపీఎం శాఖ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

పిఠాపురం: సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పిఠాపురం తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకుడు డీఎస్ బాబ్జి మాట్లాడుతూ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను అమిత్‌షా వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలన్నారు. ఆందోళనలో సీపీఎం కన్వీనర్ కుంచే చిన్నా, కోనేటి రాజు, మణి, కరణం విశ్వనాథం, జి.వీరబాబు, గోవిందాచారి, డి.గోపాలకృష్ణ, వి.సూర్యనారాయణ, డి.నాగేశ్వరరావు, ఎస్.శ్రీను, వి.నాగు తదితరులున్నారు.

తాళ్లరేవు: సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తాళ్లరేవు తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్యకర్తలు ధర్నా చేశారు. సీపీఎం నేత టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ అమిత్‌షాను మంత్రి మండలి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేత అంబేడ్కర్‌ను అవమానించడం సిగ్గుచేటన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ఎమ్.సూరిబాబుకు వినతి పత్రం అందించారు.



పెద్దాపురంలో మున్సిపల్ జంక్షన్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

క్రియ పోటీల్లో ప్రతిభ



క్రియ పోటీల్లో విజేతలుగా నిలిచిన గొల్లప్రోలు విద్యార్థులు

గొల్లప్రోలు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడలో నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి క్రియ పండుగలో గొల్లప్రోలు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మాధురి విద్యాలయకు చెందిన విద్యార్థులు పోస్టర్ ప్రజంటేషన్ జూనియర్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవగా, సీనియర్స్‌లో రెండవ స్థానం, స్టోరీ ఎనాలిసిస్‌లో సీనియర్స్ విభాగంలో మూడవ స్థానం, బుర్ర కథల విభాగంలో రెండవ స్థానంలో నిలిచారు. విజేతలను సోమవారం మాధురి విద్యాసంస్థల చైర్మన్ కడారి తమ్మయ్యనాయుడు అభినందించి సత్కరించారు.

చెందుర్తి విద్యార్థుల ప్రతిభ

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): క్రియ పోటీల్లో గొల్లప్రోలు మండలం చెందుర్తి మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సైన్స్ ప్రాజెక్టు జూనియర్స్ విభాగంలో 7వ తరగతి విద్యార్థి కొమ్ము అఖిలేష్‌కు ద్వితీయ బహుమతి, సబ్‌జూనియర్స్ విభాగంలో 5వ తరగతి విద్యార్థి పలివెల గౌతమి తృతీయ బహుమతి, చిత్రలేఖన పోటీల్లో జూనియర్స్ విభాగంలో 7వతరగతి విద్యార్థి అనంతలక్ష్మి తృతీయ బహుమతి, సృజనాత్మత వస్తువుల తయారీ సబ్ జూనియర్స్‌లో బహుమతి లభించాయి.

వాహనదారులకు కౌన్సిలింగ్



వాహనాలను సీజ్ చేసిన కాకినాడ ట్రాఫిక్ పోలీసులు

కాకినాడ క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): న్యూ ఇయర్ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న మోటారు వాహనాలను కాకినాడ ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేసి వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించి సోమవారం రాత్రి విడిచిపెట్టారు. మోడిఫైడ్ సైలెన్సర్‌లను వాడడం, మితిమీరిన వేగంతో వాహనాలను నడపడం, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసిన 70 మంది వాహనదారులను పట్టుకుని ట్రాఫిక్-2 పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి జరిమానాలు విధించి హెచ్చరించి పంపించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐలు ఎన్ రమేష్, డి.రామారావ్, ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

హెల్మెట్ ధరించాలి

పిఠాపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ సూచించారు. పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో హెల్మెట్‌ధారణపై వాహనదారులు, ప్రజలు, విద్యార్థులకు ఆయన సోమవారం అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగిన సమయంలో రక్షణగా ఉంటుందని, హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ మణికుమార్ తదితరులున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

సర్పవరం జంక్షన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలిన అపార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, పార్లమెంటరీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం పండూరులో ఎన్నికల అధికారి కవికొండల భీమశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలాధ్యక్షుడి ఎన్నికలో పండూరుకు చెందిన నందూరి సత్తిబాబు ఎన్నికయ్యారు. మహిళలు, యువకులకు ప్రాధాన్యమిస్తూ మండలాధ్యక్షుడి ఎన్నిక నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.లీలావతి, బి.రామకృష్ణ, సలాది అనిల్‌కుమార్, బావిశెట్టి వీరబాబు, పళ్ల ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటంతోనే సమస్యల పరిష్కారం

పిఠాపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా పోరాటం సాగిస్తే పరిష్కారం లభిస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు జి.శ్రీకాంత్, కె.సిద్ధూ అన్నారు. పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం జెండాను పిఠాపురం మండల అధ్యక్షురాలు, కాకినాడ జిల్లా గర్ల్స్ విభాగం కన్వీనర్ చిన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రకాష్, ప్రేమ్‌కుమార్, వెంకటేష్, వీవీ రమణ, మహేష్, శశి, సుభాష్, కమల, సింధూ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం!



రెయిలింగ్ లేని వంతెనపై ప్రమాదకరస్థితిలో వెళ్తున్న మోటర్‌సైక్లిస్ట్

కరప, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరప మండలం వేములవాడ-గొర్రిపూడి ఏటిగట్టు రోడ్డులో శహపురం డ్రెయిన్, తుల్యభాగ డ్రెయిన్‌లు కలిసేచోట నిర్మించిన ఏళ్లనాటి ఎల్లేటితూముల వంతెన పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా ఉండే ఇనుప రెయిలింగ్ పూర్తిగా తుప్పపట్టి ఎప్పుడో కాలగర్భంలో కలిసిపోయింది. దీంతో ఈ శిథిల వంతెనపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో ప్రమాదం అంచున ప్రయాణం సాగించాల్సిన దుస్థితి ఉంటుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిల వంతెనకు మోక్షం కలిగించాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వరం చొరవ

కాకినాడ కమిషనర్ భావన



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి సుమారు 8మంది ఫోన్ చేసి తమ సమస్యలు తెలిపారు. అనంతరం నిర్వహించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో పలు సమస్యలపై 28 అర్జీలను కమిషనర్ భావన స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కెటి సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు కట్టాలి

కాకినాడ నగరపాలక సంస్థ ఆస్తి పన్నులు, నీటి చార్జీల బకాయి ఉన్న యాజమానులపై చర్యలు తీసుకుంటుంది. సోమవారం స్థానిక 3,4 వార్డుల్లో కుళాయి చార్జీ బకాయి ఉన్న సుమారు 37 ఇళ్లల్లో కుళాయి కనెక్షన్లను తాత్కాలికంగా తొలగించారు. మంగళవారంలోపు బకాయిలు కట్టాలని లేకుంటే కేసు నమోదు చేస్తామన్నారు. పన్నులు చెల్లించి నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ భావన కోరారు.

జగన్ ప్రభుత్వం వల్లే ప్రజలపై ఆర్థిక భారం

టీడీపీ కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి దంపతులు



టీడీపీ సభ్యత్వాలు 53 వేలు పూర్తయిన సందర్భంగా కేకు కట్ చేస్తున్న పిల్లి దంపతులు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ హయాంలో వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్లే ట్రూ అప్ చార్జీల రూపంలో ప్రజలపై కోట్లాది రూపాయలు భారం పడిందని టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి తెలిపారు. సోమవారం ఇంద్రపాలెం పిల్లి సత్యనారాయణమూర్తి కల్యాణ మండపంలో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదులో వారు మాట్లాడుతూ జగన్ పాలనలో ప్రజలపై రూ.32,166 కోట్లు అదనపు భారం మోపారన్నారు. అప్పుడు పెంచిన చార్జీలే ఇప్పుడు అమలు అవుతున్నాయన్నారు. విద్యుత్తు రంగంపై రూ.1,29,503 కోట్లకు పైగా భారాన్ని మోపిన ఘనత జగన్‌దే అన్నారు. జగన్ ప్రభుత్వ అవినీతి వల్ల విద్యుత్తు సంస్థలపై రూ.49,596 కోట్లు అప్పులు పెరిగాయన్నారు. వినియోగదారులపై 32,166 కోట్ల అదనపు భారం పడిందన్నారు. కాకినాడ రూరల్ మండలంలో 53 వేలు టీడీపీ సభ్యత్వాలు పూర్తి అవ్వడంతో కేక్ కట్ చేశారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం శిక్షణ

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పీఆర్ ప్రభుత్వ కళాశాలలో సోమవారం ఏఎన్ఎంఐ, ఏడబ్ల్యుఎస్, వీవోస్, ఆర్పీలు, ఉపాధ్యాయులు తదితరులకు కిశోరి వికాసం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు మొదటిగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ బాలికల వికాసం సంపూర్ణ సాధికారత కోసం లింగ వివక్షత లేని సమాజాన్ని నెలకొల్పాలన్నారు. లైంగిక వేధింపుల నుంచి రక్షించడం, బాల్య వివాహాలను అరికట్టి మానవ అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బేటీ బచావో-బేటీ పడావోకు సంబంధించి వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జువాలజీ హెడ్ చక్రవర్తి, ఎంఈవో సత్యనారాయణ, మూడో పట్టణ సీఐ ఎ.సత్యనారాయణ, బాలల పరిరక్షణ అధికారి వెంకట్రావు, మెడికల్ ఆఫీసర్, మెప్మా ఈసీవో ధనలక్ష్మి,సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించిన దృశ్యం

న్యూ ఇయర్ వేడుకలకు వనమాడి దూరం

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు దూరంగా ఉండడానికి నిర్ణయం తీసుకున్నారు. ప్రజలకు ఆర్థిక భారం కాకూదనే భావంతో ఆ వేడుకలకు దూరంగా ఉంటున్నానని పేర్కొన్నారు. ఎన్నో ఆశలను మోసుకొస్తున్న కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రాష్ట్ర ప్రజలకు ఎన్‌డీఏ కూటమి శ్రేణులకు ఆరోగ్యం సంపద ఆనందం కలగజేయాలని ఆ భగవంతుని కోరుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రో కబడ్డీ రిఫరీ మురళీకుమార్‌కు అభినందన

సామర్లకోట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లో జరిగిన ప్రో కబడ్డీ అంతర్జాతీయ పోటీల్లో రిఫరీగా వ్యవహరించి తిరిగి స్వదేశాగమనం చేసి స్వగ్రామం అయిన సామర్లకోట చేరుకున్న బోగిళ్ళ మురళీకుమార్‌కు సామర్లకోటకు చెందిన ఎస్‌బీ ఎస్ఆర్‌సీ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఘనంగా స్వాగతం పలికి పూలమాలలతో అభినందించారు. ఇప్పటివరకూ 9దఫాలు వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రోకబడ్డీ పోటీలకు మన దేశం తరపున కేంద్ర క్రీడామంత్రిత్వశాఖకు చెందిన ఎంపిక బృందం ఎంపిక చేసిన పదిమందిలో ఒకడిగా తెలుగురాష్ట్రాల తరపున ప్రోకబడ్డీ రిఫరీగా వ్యవహరించానని మురళీకుమార్ తెలిపారు.



మురళీ కుమార్‌ను పూలమాలలతో అభినందించిన దృశ్యం

నేడు పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పిఠాపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం ఉదయం 11గంటలకు జరుగుతుందని కమిషనరు కనకారావు తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్‌హాలులో చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాలోని అంశాలతో పాటు సభ్యులు ప్రస్తావించే అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు. కాగా అజెండాలో గత సమావేశాల్లో 3సార్లు వాయిదా వేసిన అంశాలతో పాటు తిరస్కరించిన అంశాలను యథావిధిగా పొందుపరచడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం ఈ విధంగా అజెండాలోకి తీసుకురావడం సమంజసం కాదని పలువురు చెబుతున్నారు.

గొల్లప్రోలులో...

గొల్లప్రోలు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం 11గంటలకు జరగనున్నది. నగరపంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన జరిగే సమావేశంలో అజెండాపై చర్చ తో పాటు సభ్యులు ప్రస్తావించే సమస్యలు, వివిధ అంశాలపై చర్చ జరుగుతుందని కమిషనరు రవికుమార్ చెప్పారు. కౌన్సిల్‌సభ్యులు అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

సామర్లకోటలో...

సామర్లకోట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ జీ. అరుణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీవిద్య తెలిపారు. సమావేశంలో పట్టణాభివృద్ధికి చెందిన పలు అంశాలు, గత సమావేశంలో వాయిదా పడిన అంశాలు చేర్చినందున కౌన్సిలర్లు హాజరుకావాలని కోరారు.

2న కొత్తపల్లి సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జనవరి 2న కొత్తపల్లి మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విధిగా హాజరుకావాలని కోరారు. సమావేశానికి మండల, గ్రామస్థాయి అధికారులు నివేదికలతో హాజరుకావాలని ఆయన సూచించారు.

'నైపుణ్య శిక్షణకు దరఖాస్తు చేసుకోండి'

పెద్దాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వివిధ రకాల వృత్తులకు చెందిన వారు ఆయా పనుల్లో మెరుగైన మెరుగైన నైపుణ్యాలను పొందేందుకు నైపుణ్య శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. జనవరి 2లోగా మున్సిపల్ కార్యాలయంలో మెప్మా విభాగంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా శిక్షణ,ధృవపత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

సంకెళ్లతో నిరసన



నిరసన తెలుపుతున్న దూసర్లపూడి

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు కుళాయి చెరువు ఉద్యానం తూర్పుగేటు తెరవాలని కాకినాడ కలెక్టరేట్ ఎదుట సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు నిరసన వ్యక్తం చేశారు. ఆయన కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేసుకుని నిరవధిక నిరసన తెలిపారు. కుళాయి చెరువు పార్కు తూర్పుగేటు ప్రవేశం కల్పించే దిశగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

సామర్లకోటలో విశేష పూజలు

సామర్లకోట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖరశర్మ, అంజిబాబు తదితరుల వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారికి పంచద్రవ్యాలతో అభిషేక, విశేష పుష్పార్చన పూజలు.. బాలాత్రిపుర సుందరికి విశేష కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు.

'ఆదిత్య'లో ముగిసిన శిక్షణ

గండేపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'హ్యాండ్స్ ఆన్ పీసీబీ డిజైన్' ట్రైనింగ్‌ను ఆరు రోజులు విజయవంతంగా నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎలక్ట్రానిక్ రంగంలో వినియోగించే ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు తయారు చేయించ డంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణా సంస్థకు చెందిన సీహెచ్ సంతోష్ శిక్షణాధిపతిగా హాజరయ్యారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



కుటుంబ సభ్యులతో కలిసి పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

విద్యార్థుల అ'పూర్వ' కలయిక

మోతుగూడెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలోని ఏపీఎస్ఈబీ పాఠశాలలో 1992-93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం మరలా కలుసుకున్నారు. సుమారు 60 మంది కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. పాఠశాలలో అడుగు పెట్టగానే వారంతా విద్యార్థులు అయిపోయారు. నాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. కుటుంబ యోగ క్షేమాలు తెలుసుకుంటూ పలకరింపులతో పులకరించిపోయారు. నాడు చదువుకున్న తరగతి గదులను పరిశీలించారు. వారంతా ఏపీ జెన్కో అతిథి గృహం, దారాలమ్మ పిక్నిక్ స్పాట్, పొల్లూరు జలపాతం, ఫోర్‌బై రిజర్వాయర్ వద్ద ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కలిసి భోజనాలు చేశారు. చదువు చెప్పిన గురువుల్లో గతించిన వారిని గుర్తు చేసుకుని కొంతసేపు మౌనం పాటించారు. పూర్వ విద్యార్థుల్లో కొందరు ఏపీ జెన్‌కో పాఠశాలలో, పవర్ ప్లాంట్‌లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ ఆత్మీయ కలయికకు సతీష్ రాఘవన్, ఏపీ జెన్‌కో ఉద్యోగులు నానాజీ, షరీఫ్, వ్యాపారవేత్త రాంప్రసాద్ సారథ్యం వహించారు.



చింతూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అమిత్ షాను కేబినెట్ నుంచి తొలగించాలి

చింతూరు, వీఆర్ పురం, కూనవరం, రాజవొమ్మంగి, ఎటపాకల్లో సీపీఎం నాయకుల ఆందోళన

చింతూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో చేసిన అనుచిత వ్యాఖ్యలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణం చెప్పాలని సీపీఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం చింతూరులో ఆ పార్టీ నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అమిత్ షాను మంత్రివర్గం నుంచి తొలగించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. నాయకులు సీసం సురేష్, పొడియం లక్ష్మణ్, మెట్టుం రాజయ్య, ముర్రం రంగమ్మ, వేక రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు లోతా రామారావు మాట్లాడుతూ అమిత్ షా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి కొండ్ల సూరిబాబు, నాయకులు పి.పాపారావు, టి.శ్రీను, రామరాజు, సింగిరెడ్డి అచ్చారావు, బుడమ బాబురావు, కుంజం జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

కూనవరం (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే అమిత్ షా హోం మంత్రి అయ్యారని, అలాంటి మహనీయుడిపై అనుచిత వ్యాఖ్యలు సరికావని సీపీఎం జిల్లా నాయకుడు మేకల నాగేశ్వరరావు అన్నారు. ఆ పార్టీ నాయకులు కూనవరం నుంచి ర్యాలీగా వెళ్లి టేకులబోరులోని అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, పాయం సీతారామయ్య, సర్పంచ్‌లు నాగమణి, తలగాని నాగరాజు, నోముల సత్యనారాయణ, కొండ ఈశ్వరుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ పురం (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం మండల కార్య దర్శి పులి సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు రేఖపల్లి కూడలిలో మానవహారం నిర్మించారు. ర్యాలీగా అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి అమిత్ షాను పదవి నుంచి తొలగించాలని నినాదాలు చేశారు. ఎంపీపీ కారం లక్ష్మి, సీపీఎం మండల నాయకులు పంకు సత్తిబాబు, వడ్లాది రమేష్, పి.శ్రీరామమూర్తి, శీరపు తాతబాబు, జి.లక్ష్మణరావు, సర్పంచ్‌లు పూనెం సరోజిని, వెట్టి లక్ష్మి, సవలం మారయ్య, కారం సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సాక్షిగా డాక్టర్ అంబేడ్కర్‌ను అవమానపరచిన అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కాక అర్జున్ డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తోట శ్రీనివాస్, అనుప్రసాద్, ముక్కోటేశ్వరరావు, అప్పారావు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో...



కూనవరంలో...



వీఆర్ పురం మండలం లేఖపల్లిలో...



ఎటపాకలో...

గిరిజన రైతుల భూముల పరిశీలన

దేవీపట్నం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన గిరిజన రైతుల భూములను రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ సోమవారం పరిశీలించారు. ముంపు బాధిత రైతులకు లోతుపాలెం, బియ్యంపల్లి, ఇందుకూరు గ్రామాల్లో భూమికి భూమి ఇచ్చారు. గతంలో నిర్వాసితులకు అధికారులు కొండ, చౌడు భూములు ఇచ్చిన విషయాన్ని సోమవారం రంపచోడవరం సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆమె ఆయా భూములను పరిశీలించారు. నివేదిక సమర్పించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. తహసీల్దారు సత్యనారాయణ, వీఆర్వో, సచివాలయ సర్వేయర్ సాగర్ పాల్గొన్నారు.



లోతుపాలెంలో భూమిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ఇసుక దందాను అరికట్టడమే లక్ష్యం: తహసీల్దారు వేణుగోపాల్

వై.రామవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చేపట్టిన ఉచిత ఇసుక విధానం పక్కదారి పట్టకుండా నిజమైన గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఉచిత ఇసుక అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తహసీల్దారు పి.వేణుగోపాల్ స్పష్టం చేశారు. ఇసుక విధానంపై రెవెన్యూ అధికారులపై రాజకీయ నాయకులు చేస్తున్న ఆరోపణలు సరికావన్నారు. కాంట్రాక్టర్లు, దళారులు అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుకట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామన్నారు. విచారణ అనంతరం ఆధారాలు, అనుమతుల మేరకు తగిన చర్యలు తీసుకుని వదిలేస్తున్నామన్నారు. లబ్ధిదారులు తెచ్చుకున్న ధ్రువపత్రాల ఆధారంగా వారికి ఉచిత కూపన్లు ఇచ్చి ఇసుక ఉచితంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు





కిర్లంపూడి ఉన్నత పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, శంఖవరం విద్యార్థి సత్యని అభినందిస్తున్న దృశ్యం

'క్రియ' పోటీల్లో సత్తా చాటారు

కిర్లంపూడి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలో జరిగిన క్రియ పిల్లల పండుగలో కిర్లంపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని జి.హనీ స్టోరీ టెల్లింగ్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. 8వ తరగతి విద్యార్థిని వై.మంగ ఏకపాత్రాభినయంలో రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. జూనియర్స్ క్విజ్‌లో ఆడారి సోమేశ్వరి, కాళ్ల సరయుప్రశాంతి, జి.సోని బృందం తృతీయ బహుమతి అందుకుంది. విజేతలను ప్రధానోపాధ్యాయుడు ప్రకాశరావు, విద్యా కమిటీ ఛైర్మన్ ఆళ్ల బాబులు, దాడి గోవిందు, స్టాఫ్ సెక్రటరీ కల్యాణ్ పైడేశ్వరరావు, క్రాఫ్ట్ టీచర్ ఎం.కుమారి, శిరీష, నాగరాజు, కృష్ణమోహన్, రాపేటి పెద్దిరాజు, పీడీ సత్య అభినందించారు.

శంఖవరం (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన క్రియ పిల్లల పండుగలో గొల్లప్రోలు మాధురి పాఠశాల పదో తరగతి విద్యార్థి నాగం సత్య పోస్టర్ ప్రజెంటేషన్ విభాగంలో బహుమతి సాధించింది. ఆమెను పాఠశాల ఛైర్మన్ కదారి తమ్మయ్యనాయుడు, ప్రిన్సిపాల్ ఆదినారాయణ, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.





ప్రత్తిపాడులో ఎమ్మెల్యే సత్యప్రభని సత్కరిస్తున్న పాస్టర్లు, గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటలో క్రిస్మస్ వేడుకలు

'క్రీస్తు బోధనాలు శాంతికి దోహదం'

ప్రత్తిపాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దోహదమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా చెప్పారు. స్థానిక ఎల్ఎఫ్‌టీఎల్ చర్చిలో సోమవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. సాటి మనిషిపట్ల ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండడమే బైబిల్ సారాంశమని చెప్పారు. ఎమ్మెల్యేను చర్చి నిర్వాహకులు జాకబ్, చిన్నిబాబు ఘనంగా సన్మానించారు

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాద్రిరావుపేటలో మెగా యూత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి కేక్ కట్ చేశారు. సర్పంచ్ మూలంపంక సురేష్, దారబల్ల సద్గురుమూర్తి, పల్లా ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



గద్దె రామ్మోహనరావు నుంచి నగదు బహుమతి అందుకుంటున్న సాయిలక్ష్మి

కౌశల్ ప్రతిభాన్వేషణ పోటీల్లో

సాయిలక్ష్మి ప్రతిభ

తొండంగి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కౌశల్ రాష్ట్ర స్థాయి ప్రతిభాన్వేషణ పోటీల్లో ఎ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సీహెచ్ సత్యసాయిలక్ష్మి పోస్టర్ ప్రజెంటేషన్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీమాణిక్యం తెలిపారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు నుంచి సాయిలక్ష్మి నగదు బహుమతి అందుకుంది. విద్యార్థినిని పెద్దాపురం డీవైఈవో ప్రభాకర శర్మ, ఎంఈవోలు షేక్ బాబ్జీ, ఎ.సుబ్బిరెడ్డి, విద్యా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు.

వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిర హోమం

అన్నవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో అమావాస్య సందర్భంగా సోమవారం ప్రత్యంగిర హోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభించారు. పుణ్యాహవచనం అనంతరం ప్రత్యంగిర దేవతను మంత్రపూర్వకంగా ఆహ్వానించి పారాయణలు, జపాలు నిర్వహించారు 11 గంటలకు పూర్ణాహుతి గావించారు.

ఉత్తరకంచి-పెద్దిపాలెం రహదారికి రూ.1.50 కోట్లు మంజూరు

ప్రత్తిపాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉత్తరకంచి-పెద్దిపాలెం రహదారికి రూ.1.50 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా సోమవారం చెప్పారు. 2.10 కిలోమీటర్లు కలిగిన ఈ రహదారి నిర్మాణ పనులను వెంటనే చేపడతామని తెలిపారు. పెద్దిపాలెం నుంచి గోకవరం వరకు 1.50 కిలోమీటర్ల రహదారికి రూ.1.30 కోట్లు, రౌతుపాలెం, గోకవరం వేములపాలెం బీటీ రహదారులకు రూ.40లక్షలు, టి.రాయవరం బీటీ రహదారికి రూ.80 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. నిధుల మంజూరుపై సర్పంచ్‌లు మంతెన శ్రీను, తటవర్తి సుబ్బారావు, వనపర్తి రామలక్ష్మీనాగేశ్వరరావు, ఇళ్ల అప్పారావు, బీసీ నేత లొండా లోవరాజు హర్షం వ్యక్తం చేశారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

జగ్గంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో సోమవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను కించపరచడం తగదన్నారు. డివిజన్ నాయకులు డి.సురేష్, కొండేపూడి మంగమ్మ, కరుణ, రామారావు నాయకత్వం వహించారు.

బీజేపీ ప్రత్తిపాడు మండల అధ్యక్షుడిగా వీరబాబు

ప్రత్తిపాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రత్తిపాడు మండల అధ్యక్షుడిగా ధర్మవరానికి చెందిన ఊటా వీరబాబు ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన ఎన్నికలో వీరబాబు, కర్రి ధర్మరాజు, గొనగాని గోపాలస్వామి నామినేషన్లు దాఖలు చేశారు. మిగతా ఇద్దరూ నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో వీరబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి పతివాడ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కామినేని జయశ్రీ, మండల అబ్జర్వర్ బొలిశెట్టి రామకృష్ణ ప్రకటించారు. వీరబాబును బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు, నాయకులు పైలా సుభాష్‌చంద్రబోస్, మట్టా మంగరాజు, కందా వీరాస్వామి అభినందించారు.



సంతకం చేస్తున్న బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు వీరబాబు

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

జగ్గంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ నేతృత్వంలో ప్రతి సోమవారం అన్న క్యాంటీన్ ఏర్పాటుచేసి దాతల సహకారంతో పేదలకు ఉచితంగా భోజనం అందిస్తున్నారు. ఈ వారం గోకవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు-చల్లీదేవి దంపతుల ఆర్థిక సహాయంతో భోజనాలు సమకూర్చగా వారి కుమారుడు డాక్టర్ గాజింగం సాయి హాజరై పదార్థాలు వడ్డించారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, భారతీయ ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్రచౌదరి, తంటికొండ దేవస్థానం మాజీ ఛైర్మన్ పెద్దాడ వెంకన్నదొర, కర్రి శివ, వేములకొండ జోగారావు తదితరులు పాల్గొన్నారు.



భోజనాలు వడ్డిస్తున్న టీడీపీ నాయకులు

బాల్య వివాహాలు నేరం: ఎంపీపీ

ఏలేశ్వరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'కిశోరీ వికాసం'పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం, చేయించడం నేరమని... కారకులపై కేసులు నమోదు చేస్తామన్నారు. చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. తమని తాము రక్షించుకునేలా బాలికలకు విద్య నేర్పించాలన్నారు. అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. ఎంపీడీవో సూర్యనారాయణ, ఐసీడీఎస్ అధికారి పద్మావతి, ఎంఈవో బి.అబ్బాయి, డాక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ

కోటనందూరులో విద్య, వైజ్ఞానిక ప్రదర్శన

కోటనందూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్య, వైజ్ఞానిక ప్రదర్శనల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని తహసీల్దారు సుభాష్, ఎంపీడీవో నారాయణ కోరారు. సోమవారం కోటనందూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఎంఈవోలు శ్రీనివాస్, రామ్‌శేఖర్, వేణుగోపాల్, సీఆర్పీ యర్ర వెంకట గోవింద్ శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న దృశ్యం

న్యూ ఇయర్ వేడుకల్లో హద్దు మీరితే సహించం

ఎటపాక సీఐ కన్నపరాజు

ఎటపాక, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): న్యూ ఇయర్ వేడుకల్లో హద్దుమీరి ప్రవర్తిస్తే ఎంతటి వారినైనా సహించే ప్రసక్తే లేదని సీఐ కన్నపరాజు పేర్కొన్నారు. సోమవారం ఆయన ఎటపాకలో మీడియాతో మాట్లాడారు. న్యూ ఇయర్ వేడుకలను పోలీసు నిబంధనల ప్రకారం జరుపుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని, ర్యాలీలు, డీజే సౌండ్‌లతో శబ్ద కాలుష్యంతో ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదన్నారు.. ట్రిపుల్ రైడింగ్, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే ఊరుకునేది లేదన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. న్యూ ఇయర్ వేడుకలను ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

తాగి వాహనాలు నడపవద్దు

గండేపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు తెలిపారు. న్యూ ఇయర్ సందర్భంగా తాగి వాహనాలు నడపరాదన్నారు. అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. రోడ్లపై కేక్‌లు కట్ చేయరాదని హెచ్చరించారు. ఇళ్లల్లో కుటుంబీకులతో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించుకోవాలన్నారు.

రెండు నుంచి క్రీడా పోటీలు

జగ్గంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల యువకులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి ఎస్ఐలు రఘునందనరావు, శివనాగబాబు, సతీష్ ఆధ్వర్యంలో యువకులకు వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, మహిళలు, బాలబాలికలకు ముగ్గులు, మ్యూజికల్ ఛైర్స్, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. జగ్గంపేట డిగ్రీ కళాశాల ప్రాంగణంలో వచ్చే నెల రెండు నుంచి ఏడో తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. అన్ని టీములు రెండో తేదీ ఉదయం ఏడు గంటలకు క్రీడా ప్రాంగణానికి చేరుకోవాలన్నారు. విన్నర్స్, రన్నర్స్‌కు ఆకర్షణీయమైన బహుమతులు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మహిళా పోలీసులను సంప్రదించాలని సీఐ సూచించారు.

యర్రంపాలెం సర్పంచ్ ఇజ్జిన చిన్నారి మృతి



గండేపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రంపాలెం సర్పంచ్ ఇజ్జిన చిన్నారి (28) కన్నుమూశారు. చిన్నారికి శనివారం జ్వరం రావడంతో పిఠాపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. చిన్నారి యర్రంపాలెం నుంచి 2021లో టీడీపీ మద్దతుతో సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. చిన్నారికి భర్త అర్జున్, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఆమె మరణంతో కుటుంబీకులతో పాటు గ్రామస్తులు శోకసంద్రంలో మునిగారు. చిన్న వయసులో మృతి చెందడం దురదృష్టకరమని, మంచి నాయకురాలిని కోల్పోయామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే జ్యోతులకు అభినందనలు

జగ్గంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం మల్లవరం బోడపాల్ రాజ్ చెరువు నీటి సంఘం అధ్యక్షుడిగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దివంగత సత్యం సుభాష్ చంద్రబోస్ పెద్ద కుమారుడు శ్యాంసుందర్ ఎన్నికైన సంగతి తెలిసిందే. సోమవారం నీటి సంఘం సభ్యులు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఉపాధ్యక్షుడు గంటి వీరబాబు, సభ్యులు కరణం గోవింద్, ఆది వీరబాబు, బుదిరెడ్డి వెంకటస్వామి, పడాల కాట్రాజు, గ్రామ సర్పంచ్ యిడుదల అర్జునరావు, టీడీపీ అధ్యక్షుడు గొర్రెపల్లి శ్రీను, ఉప సర్పంచ్ లంక శ్రీను, టీడీపీ యువ నాయకుడు సత్యం రాజా, మాజీ ఎంపీటీసీ సిరందాసు రాజు, జనసేన అధ్యక్షుడు జీవీ నాయుడు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

తొండంగి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా నూతన కమిటీ ఎన్నిక సోమవారం బెండపూడి శివారులోని ఓ ఫంక్షన్ హాలులో జరిగింది. అధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా ఎం.గంగా సూరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వరహాలు, వాసు, సాయిత్, సహాయ కార్యదర్శులుగా మణికంఠ, చిన్ని, సిద్ధు, సంజయ్‌లతో పాటు 20 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు రాజీలేని పోరాటం చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. 29వ జిల్లా మహాసభలో తొమ్మిది తీర్మానాలను ఆమోదించినట్టు గంగా సూరిబాబు తెలిపారు. రెండు రోజుల సభలు విజయవంతమయ్యాయన్నారు.

తహసీల్దారు కార్యాలయ ముట్టడి

ఏలేశ్వరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపిక్కల పరిశ్రమ కార్మికులు సోమవారం తహసీల్దారు కార్యాలయాన్ని ముట్టడించారు. పరిశ్రమను అర్ధంతరంగా మూసివేయడంతో 409 మంది కార్మికులు రోడ్డునపడ్డారని, న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అక్కడకు చేరుకున్న ఎస్ఐ రామలింగేశ్వరరావు జోక్యం చేసుకుని... సమస్యను సానుకులంగా పరిష్కరించుకోవాలని సూచించారు. తహసీల్దారు వెంకటేశ్వరరావు స్పందించి కార్మికుల సమస్యను ఫోనులో కార్మిక శాఖ జోనల్ అధికారి రాణి దృష్టికి తీసుకెళ్లారు. జనవరి 6న పరిశ్రమ యాజమాన్యం, కార్మికుల మధ్య చర్చలు జరిపి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

హుండీల ఆదాయం రూ.1.70 లక్షలు

తుని రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం ఆధ్వర్యంలో తునిలో వున్న తలుపులమ్మ ఆలయంలోని హుండీలను గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎం.రమణి, ఆలయ ధర్మకర్తల సమక్షంలో సోమవారం తెరిచి లెక్కించారు. 178 రోజులకు రూ.1.78 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో విశ్వనాథరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

అదనపు కోర్టు ఏర్పాటుకు వినతి

ప్రత్తిపాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో అదనపు కోర్టు ఏర్పాటు చేయాలని తూర్పు గోదావరి జిల్లా పోర్టుఫోలియో జడ్జి ఎన్.సూర్యకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రత్తిపాడులో పూర్తయిన జడ్జి బంగ్లాను వెంటనే ప్రారంభించాలని బార్ అసోసియేషన్ నాయకులు చిట్టిబాబు, నాగేంద్రరాజు కోరారు.